www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 167 | శనివారం 08.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



# నాగార్జునసాగర్.. వరుణ యాగం

- రాష్ట్ర సుభిక్షం కోసం మహా వరుణ యాగానికి సీఎం నిర్ణయం
- వర్షాల కోసం నాగార్జునసాగర్ వేదికగా మహా వరుణ యాగం
- ఆగస్టు 10న ప్రభుత్వం ఆధ్వర్యంలో వైభవంగా వరుణ యాగం
- సమృద్ధి వర్షాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వైదిక క్రతువు
- ఎల్‌నినో ప్రభావం తగ్గాలని ప్రత్యేక యాగానికి శ్రీకారం
- నాగార్జునసాగర్‌లో 11 హోమకుండాలతో మహా యాగం
- 108 మంది వేద పండితులతో శాస్త్రోక్తంగా వరుణ యాగం

03

## రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక వేద ప్రార్థనలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరఫున మహా వరుణ యాగం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఎల్‌నినో వంటి వాతావరణ ప్రతికూల ప్రభావాలు తగ్గి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే బృహత్తర సంకల్పంతో నాగార్జునసాగర్ వేదికగా ఈ పవిత్ర వైదిక క్రతువుకు శ్రీకారం చుట్టారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు, వేద పండితులు, దేవస్థాన సిద్ధాంతి శాస్త్రోక్తంగా చర్చించి ఆగస్టు 10వ తేదీని శుభ ముహూర్తంగా నిర్ణయించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ డ్యామ్ తీరాన ఉన్న విజయవిహార్ ప్రాంగణంలో...



## చేనేత రంగానికి అండగా ప్రజా ప్రభుత్వం

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతికి చేనేత కళ గొప్ప వారసత్వమని కొనియాడారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆధునిక సాంకేతికత, మార్కెటింగ్ అవకాశాలతో చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. నేతన్నల జీవనోపాధి బలోపేతానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. 02

# ఎన్నారైలకు భట్టి పిలుపు

## నైపుణ్యాభివృద్ధి కేంద్రాలతో ఉపాధికి కొత్త దారి



- అమెరికా పర్యటనలో పెట్టుబడిదారులతో డిప్యూటీ సీఎం భేటీ
- శాన్ ఫ్రాన్సిస్కోలో తెలంగాణ పెట్టుబడి అవకాశాలపై వివరణ
- తెలంగాణనే తొలి పెట్టుబడి గమ్యంగా ఎంచుకోవాలి: భట్టి
- హైదరాబాద్ గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా వేగంగా ఎదుగుతోంది
- పారదర్శక పాలనతో పెట్టుబడులకు అనుకూల వాతావరణం
- పరిశ్రమలు-ప్రభుత్వం కలిసి అభివృద్ధికి అడుగులు వేయాలి
- మూసీ పునరుద్ధరణ, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్రాభివృద్ధిలో ఎన్నారైల భాగస్వామ్యాన్ని కోరిన భట్టి
- నైపుణ్యాభివృద్ధి కేంద్రాలతో ఉపాధికి కొత్త దారి


# హైకోర్టు కీలక వ్యాఖ్యలు

సమాజంలో ఎవరికైనా బాధ్యత ఉందా..

## ఉచిత పథకాలపై హైకోర్టు సంచలన వ్యాఖ్యలు..

- ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు
- ఉచితాల భారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం
- కోటీశ్వరులూ ఉచిత పథకాల లబ్ధిదారులే: హైకోర్టు
- రైతుబంధు అమలుపై న్యాయస్థానం కీలక పరిశీలన
- ఉచితాల వల్ల పని చేసే మనస్తత్వం తగ్గుతోంది
- గ్రామాల్లో కూలీల కొరతకు ఉచిత పథకాలే కారణమా?
- 'దేశం మనకేమిచ్చింది' అనే ధోరణిపై జస్టిస్ ఆందోళన

02





# చేనేత కళకు కీర్తి కిరీటం..

## రాజోలి నేతన్నకు అరుదైన గౌరవం

- గద్వాల చీరకు రాష్ట్రస్థాయి ప్రతిష్ఠాత్మక పురస్కారం
- జాతీయ చేనేత దినోత్సవం వేళ గద్వాల చీరకు గౌరవం
- రాజోలి చేనేత కార్మికుడు సూరె గోపాల్‌కు రాష్ట్ర అవార్డు
- గద్వాల చేనేత వైభవానికి రాష్ట్రస్థాయి గుర్తింపు
- సంప్రదాయ చేనేత కళకు దక్కిన మరో గౌరవం

02

# మంత్రి దామోదర సీరియస్

- జోగిపేట ఏరియా ఆస్పత్రిలో ఫేక్ డాక్టర్ కలకలం
- ప్రభుత్వ ఆస్పత్రిలో నకిలీ డాక్టర్ వ్యవహారం బట్టబయలు
- తన స్థానంలో ప్రైవేట్ వైద్యుడితో డ్యూటీ చేయించిన ప్రభుత్వ డాక్టర్
- డిప్యూటీ సివిల్ సర్జన్ స్థానంలో డెంటల్ డాక్టర్ సేవలు
- వైద్యారోగ్య శాఖ విచారణలో బయటపడిన భారీ నిర్లక్ష్యం
- ఫేక్ డాక్టర్ వ్యవహారంపై మంత్రి దామోదర సీరియస్

03




# సీఎంకు కేటీఆర్ బహిరంగ లేఖ

- బీజేపీ, కాంగ్రెస్ రెండూ చేనేతకు అన్యాయం చేశాయన్న కేటీఆర్
- చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ భారాన్ని ఎత్తేయాలని డిమాండ్
- చేనేత సహకార సంఘాలకు మళ్లీ రాయితీలు ఇవ్వాలని విజ్ఞప్తి
- బతుకమ్మ చీరల ఆర్డర్లలో నేతన్నలకు ప్రాధాన్యం కల్పించాలన్న డిమాండ్

03



'నేతన్నకు చేయూత' పథకం ద్వారా కార్మికుల పొదుపును ప్రోత్సహిస్తూ, కార్మికుడు ప్రతినెల రూ.1,200, అనుబంధ కార్మికుడు రూ.800 చెల్లిస్తే ప్రభుత్వం రూ.4,000 వరకు వాటా జమ చేసే వినూత్న విధానాన్ని అమలు చేశామని తెలిపారు. అదేవిధంగా చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, 20 శాతం మార్కెటింగ్



# నీటి హక్కులను కాపాడండి

- తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై కొత్త వివాదం
- కేంద్రం ఆమోదించిన ప్రాజెక్టులను మళ్లీ సమీక్షించొద్దు
- జీఆర్ఎంబీ అధికార పరిధిపై హరీశ్‌రావు ప్రశ్నలు
- కాళేశ్వరం సహా కీలక ప్రాజెక్టులపై ఆందోళన
- తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను తిరిగి తెరపైకి తేవొద్దు
- కేంద్ర నిర్ణయాల విశ్వసనీయత దెబ్బతింటుందని హెచ్చరిక

03

# ఇక నుంచి సహించను

## 2028 నాటికి అద్దం లాంటి రోడ్లే లక్ష్యం..

- రోడ్ల నిర్మాణంలో మైనింగ్ సమస్యలపై ఉన్నతస్థాయి సమీక్ష
- కాంట్రాక్టర్ల ఇబ్బందులపై ఇద్దరు మంత్రుల కీలక సమావేశం
- 10 రెట్లు పెనాల్టీలు విధించడం సరికాదు: కోమటిరెడ్డి
- రూ.5 కోట్ల పనికి రూ.54 కోట్ల జరిమానాపై మంత్రి ఆగ్రహం

03



# తెలంగాణలో ఏ పార్టీతోనూ పొత్తుల్లేవ్..

- జీహెచ్ఎంసీలో పొత్తులపై బీజేపీ స్పష్టత
- తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ: రాంచందర్ రావు
- జనసేన అంశం అధిష్టానం నిర్ణయమే: బీజేపీ చీఫ్
- ఎన్డీఏలో జనసేన భాగస్వామి.. తెలంగాణలో వేరు వ్యూహం
- ప్రభుత్వ వైఫల్యాలే ఎన్నికల అజెండా: బీజేపీ
- ఆరు గ్యారెంటీల అమలుపై పోరాటం చేస్తాం
- బీజేపీలో పాత-కొత్త నేతల మధ్య తేడా లేదు
- ఇతర పార్టీల నుంచి భారీ చేరికలు ఉంటాయి: రాంచందర్ రావు
- అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వమే లక్ష్యం

03





# ప్రజల సమస్యలపై వెనక్కి తగ్గని మంత్రి

తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై తక్షణ చర్యల హామీ

- వర్షంలోనూ ప్రజల మధ్యకు మంత్రి పొంగులేటి
- గొడుగు చేతిలో.. ప్రజా సమస్యలు మనసులో
- వానను లెక్కచేయని మంత్రి క్షేత్రస్థాయి పర్యటన
- టీ కొట్టులో కూర్చొని ప్రజల సమస్యలు విన్న మంత్రి
- స్థానికులతో టీ తాగుతూ సమస్యలపై ఆరా
- తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై తక్షణ చర్యల హామీ
- ఏదులాపురం అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు

05


# హుస్నాబాద్‌కు రూ.33.70 కోట్లు

**ఎల్కతుర్తి,ఫ్లాష్ ఇండియా :** హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. నియోజకవర్గ పరిధిలో గ్రామీణ రహదారులు, వంతెనలు, క్రాస్ డ్రైనేజ్ పనుల అభివృద్ధికి మొత్తం రూ.33.70 కోట్ల వ్యయంతో 28 అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి (రోడ్లు) శాఖ జి.ఓ.ఆర్.టి. నెం.425, తేదీ 06-08-2026ను జారీ చేసింది. అదేవిధంగా హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో మె-ుత్తం ఐదు అభివృద్ధి పనులకు రూ.7.70 కోట్లు మంజూరు చేశారు. ఇందులో భీమదేవరపల్లి మండలంలో నాలుగు పనులకు రూ.6.20 కోట్లు, ఎల్కతుర్తి మండలంలో ఒక పనికి రూ.1.50 కోట్లు కేటాయించారు. భీమదేవరపల్లి మండలంలోని కొప్పూర్-జగన్నాథపూర్ మధ్య కాజ్‌వే నిర్మాణానికి రూ.60 లక్షలు, రాసూల్‌పల్లి-బంగ్లాపల్లి మధ్య హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.60 కోట్లు, రాసూల్‌పల్లి-బొల్లొనిపల్లి మధ్య హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.60 కోట్లు, రాసూల్‌పల్లి-వీర్లగడ్డ తండా మధ్య లో లెవెల్ కాజ్‌వే నిర్మాణానికి రూ.2.40 కోట్లు మంజూరు చేశారు. అలాగే, ఎల్కతుర్తి మండలంలోని ఇందిరానగర్-గోపాల్‌పూర్ మధ్య హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.50 కోట్లు కేటాయించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. గ్రామీణ మౌలిక సదుపా-యాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, మంజూరైన పనులను త్వరితగతిన ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో రహదారులు, వంతెనల అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత శాఖల మంత్రులకు బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మంజూరైన పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఆయన పేర్కొన్నారు. అలాగే, ఎల్కతుర్తి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు రాజిరెడ్డి మండల ప్రజల తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని వారు అన్నారు.

# చేనేత కళకు కీర్తి కిరీటం..

**రాజోలి,ఫ్లాష్ ఇండియా :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో గద్వాల చీరకు ప్రతిష్ఠాత్మక బహుమతి లభించింది. గద్వాల చీర ప్రత్యేకతను చాటుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క చేతులమీదుగా రాజోలి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు సూరె గోపాల్ ఈ రాష్ట్రస్థాయి బహుమతిని అందుకున్నారు. గద్వాల చీరకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం పట్ల రాజోలి గ్రామస్తులు, చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. సంప్రదాయ చేనేత కళను కాపాడుతూ, గద్వాల చీరకు మరింత గుర్తింపు తీసుకురావడంలో సూరె గోపాల్ చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. ఈ పురస్కారం చేనేత కార్మికుల్లో నూతనోత్సాహాన్ని నింపుతుందని వారు పేర్కొన్నారు.

# హైకోర్టు కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉచిత పథకాలు, ప్రభుత్వ పాలనా తీరుపై తెలంగాణ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. సమాజంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పెరిగిపోతున్న ప్రమాదకర పరిస్థితులను హెచ్చరించే ఉద్దేశంతోనే ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ బీమాపాక స్పష్టం చేశారు. ఉచిత పథకాలను కోటీశ్వరులు కూడా పొందుతున్నారని, రైతుబంధు వంటి పథకాల వల్ల ఎంతోమంది ధనికులు లబ్ధి పొందుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వంపై విపరీతమైన ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ దేశానికి మనం ఏమి ఇచ్చామని ఆలోచించే వాళ్లమని, గాంధీ, నెహ్రూ, ప్రకాశం పంతులు వంటి మహనీయులను చూసి దేశానికి ఏదో ఒకటి చేయాలని తపించేవారని గుర్తుచేశారు. కానీ నేడు పరిస్థితులు మారిపోయి, ఈ దేశం మనకేమిచ్చింది లేదా నాకేమిచ్చారనే ధోరణి పెరిగిపోయిందని వ్యాఖ్యానించారు. ఉచిత పథకాల కారణంగా పల్లెటూర్లలో పనిచేయడానికి కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడిందని, రైతుల స్థితి ఘోరంగా తయారైందని తెలిపారు. ఉచితంగా లభిస్తుండటంతో నేనెందుకు పనిచేయాలనే అభిప్రాయానికి ప్రజలు వస్తున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే ఒకప్పుడు మనుషులు స్వయంగా పనిచేసేవారట అని చెప్పుకునే రోజులు వచ్చినా ఆశ్చర్యం లేదన్నారు. ప్రభుత్వాలు ఉచితాలను ఇలాగే ఇస్తూ పోతే చివరకు కుబేరుడి వద్ద ఉన్న ధనమంతా అయిపోయి, ఆయన కూడా పనికి ఆహార పథకం కింద కూలీకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కోటి 15 లక్షల కుటుంబాలకు ఉచిత పథకాలు ఇస్తే దేశాన్ని ఎలా నడుపుతారని ప్రశ్నించిన ఆయన, విద్యార్థులకు ఫీజుల చెల్లింపులోనూ అర్హులైన, బాగా చదువుకునే వారికి మాత్రమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని సూచించారు. కాలేజీలకు వెళ్లకుండా తిరిగే విద్యార్థులు యా-జమాన్యాలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వాలు చేసే తప్పిదాల వల్ల ఉన్నతాధికారులు బలి అవుతున్నారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నందుకే సందీప్ సుల్తానియాపై ఏకంగా 3,000 నుంచి 4,000 కేసులు నమోదు కావడం, వందకు పైగా కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండటంపై విచారం వ్యక్తం చేశారు. ఈ లెక్కన చూస్తే ఆయన జీవితకాలం జైల్లోనే ఉండాల్సి వస్తుందని, మీరు ముఖ్యమంత్రి అయితే ఈ కేసులపై ఏం చేస్తారని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. సందీప్ సుల్తానియా మంచి అధికారే అయినప్పటికీ, తప్పనిసరి పరిస్థితుల్లోనే కోర్టుకు పిలిపిస్తున్నామని తెలిపారు. ఇవన్నీ ఏ ప్రభుత్వాలపైనా విమర్శలు లేదా రాజకీయ ఉపన్యాసాలు కాదని, ఒక పౌరుడిగా ఆవేదనతో, ప్రమాద ఘంటికలు మోగుతున్నాయనే పాత వాస్తవాలను తెలియజేసేందుకే చెబుతున్నామని స్పష్టం చేశారు.

# ప్రజలకు సంక్షేమ సేవలు అందించడమే లక్ష్యం

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య, తాగునీరు, సంక్షేమ సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి వాటి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో కలిసి మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య, ఆరోగ్యం, విద్య, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖల పనితీరు, పథకాల పురోగతిపై శాఖల వారీగా సమీక్షించారు.

**వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి...**

జిల్లాలో వైద్య సేవల బలోపేతంపై చర్చించిన మంత్రి, జోగిపేట ఏరియా ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ స్థానంలో నకిలీ వ్యక్తి విధులు నిర్వహించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రుల్లో వైద్యుల హాజరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని డీసీ హెచ్‌ఎస్, ఆసుపత్రి సూపరింటెండెంట్లను ఆదేశించారు. కంకోల్, సింగితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేయాలని, బర్దిపూర్, సుల్తాన్‌పూర్, నేరడిగుంట పీ హెచ్ సీ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జహీరాబాద్ ఎంసీహెచ్ లను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సంగారెడ్డి జీజీహెచ్ లో మందులు, పరికరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల కేసుల వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి, వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరికరాలు ఉండేలా చూడాలని ఆదేశించారు.

**విద్య, సంక్షేమంపై ఆదేశాలు..**

విద్యా రంగంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేజీబీవీ లు, మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, పీ హెచ్ సీ లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పా-ఠశాలల్లో తాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్ల సౌకర్యాలు పూర్తి చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**రేషన్, తాగునీటిపై సమీక్ష**

ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించిన మంత్రి, మంజీర, సింగూరు ప్రాజెక్టుల నీటిమట్టాలు, బోరంచ, భూసారెడ్డిపల్లి ఇంటెక్ వెల్‌ల ద్వారా సరఫరా వివరాలు తెలుసుకున్నారు. సరిపడు వర్షాలు పడని పక్షంలో ఎదుర-య్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చేనేత రంగానికి అండగా ప్రజా ప్రభుత్వం

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేనేతలకు, నేత కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే గొప్ప వార-సత్వం మన చేనేత కళ అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా రాష్ట్రంలోని చేనేత కార్మికులకు, నేతన్నలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చేనేత కార్మికుల కష్టపడే తత్వానికి, వారిలోని అద్భుతమైన కళాత్మకత, సృజనాత్మకతకు తగిన గౌరవం ఇవ్వడం ప్రజా ప్రభుత్వం యొక్క బాధ్యత అని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడంతో పాటు, నేతన్నల జీవ-నోపాధిని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చేనేత కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం, మార్కెటింగ్ అవకాశాలను విస్తృతం చేయడం మరియు సంప్రదాయ చేనేత కళలను కాపాడుకోవడమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు.

# కోర్టులో సీబీఐ చార్జిషీట్ దాఖలు

**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యుజీ ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన చార్జిషీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రశ్నాపత్రం లీకేజీ నుంచి అభ్యర్థులకు సమాధానాలు చేర వేయడం వరకు నిందితులు పక్కా క్రిమినల్ ప్లాన్ అమలు చేసినట్లుగా సీబీఐ ఆధారాలతో సహా పేర్కొంది.

**హ్యుందాయ్ వెర్నా కారు..**

ప్రశ్నాపత్రాలను భద్రపరిచే కేంద్రాల నుంచి లీక్ చేసిన పేపర్లను రహస్యంగా రవాణా చేయడానికి నిందితులు హ్యుందాయ్ వెర్నా) కారును వాడినట్లుగా సీబీఐ గుర్తించింది. పోలీసుల కంటపడకుండా ఉండేందుకు వాహనం నంబర్ ప్లేట్లతో పాటు ప్రయాణ రూట్లను ఎప్పటికప్పుడు అలర్ట్ అవుతూ.. మార్చినట్లుగా తెలిసింది. ఇక లీక్ చేసిన ప్రశ్నాపత్రాలు, వాటికి సంబంధించిన జవాబుల పీడీఎఫ్ ఫైళ్లను చేరవేసేందుకు ప్రముఖ మెజేజింగ్ యాప్ 'టెలిగ్రామ్' యాప్‌లోని రహస్య గ్రూపులు, ఛానెళ్లను నిందితులు ఉపయోగించారు. కోడింగ్ భాషతో కూడిన మెసేజ్‌ల ద్వారా రూ.లక్షల్లో డీల్స్ కుదుర్చుకున్నట్లుగా విచారణలో వెల్లడైంది.

**కేరళ హాస్టళ్లలో సీక్రెట్ ఆపరేషన్..**

సీబీఐ దర్యాప్తులో నీట్ యూజీ కేసులో సంచలన విషయాలు బయటపడ్డాయి. కేరళలోని ఒక ప్రైవేట్ హాస్టల్‌ను డెన్‌గా మారినట్లుగా సీబీఐ గుర్తించింది. లీకైన పేపర్లను సేకరించడం, అక్కడ విద్యార్థులతో సమాధానాలు రాయించడం, వారి ద్వారా సమాచారాన్ని మిగతా చోట్లకు చేరవేయడంలో ఈ కేరళ హాస్టల్ కేంద్రంగా పనిచేసినట్లుగా సీబీఐ చార్జిషీట్‌లో స్పష్టం చేసింది. ఇంటర్ స్టేట్ నెట్‌వర్క్‌గా విస్తరించిన ఈ నీట్ పేపర్ లీక్ ముఠాలో డిజిటల్ సాక్ష్యాలు, కార్ల వినియోగం, హాస్టల్ స్థావరాల పాత్రపై సీబీఐ పక్కా ఆధారాలను సేకరించి కోర్టు ముందు పెట్టారు.

# 6 ఏళ్ల నిరీక్షణకు తెర..

**అచ్చంపేట,ఫ్లాష్ ఇండియా :** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం కృష్ణగిరి (ఈగలపెంట) సమీపంలోని తెలంగాణ శ్రీశైలం ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో 2020 ఆగస్టు 20న జరిగిన ఘోర ప్రమాదంలో 4వ యూనిట్ పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 9 మంది ఉద్యోగులు ప్రాణాలు కోల్పోగా, రూ.100 కోట్లకు పైగా ప్రజా ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుని దోషులను శిక్షిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. అనంతరం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ప్రమాదానికి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. 4వ యూనిట్‌కు సంబంధించిన యంత్రాల మరమ్మతుల కోసం ఢిల్లీకి చెందిన వాయిత్ కంపెనీకి సుమారు రూ.25 కోట్లు కేటాయించారు. 2023, 2025 సంవత్సరాల్లో రెండుసార్లు మరమ్మతులు చేపట్టి యూనిట్‌ను ప్రారంభించే ప్రయత్నం చేసినా అవి ఫలించలేదు. దీంతో పునఃప్రారంభం పలుమార్లు వాయిదా పడింది.

**ఆరు సంవత్సరాల అనంతరం...**

2020 ఆగస్టు 20న జరిగిన ప్రమాదంతో నిలిచిపోయిన 4వ యూనిట్ దాదాపు ఆరు సంవత్సరాల అనంతరం మళ్లీ విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమైంది. ఈ నెల 10న యూనిట్‌ను ప్రారంభించేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదం అనంతరం పలు దశల్లో మరమ్మతులు చేపట్టగా, చివరకు ఢిల్లీకి చెందిన వాయిత్ కంపెనీ ఆధ్వర్యంలో రూ.25 కోట్ల వ్యయంతో కీలక మరమ్మతులు పూర్తి చేశారు.

**అన్ని సాంకేతిక పరీక్షలు పూర్తి**

ప్రస్తుతం యూనిట్‌ను తిరిగి గ్రిడ్‌కు అనుసంధానించేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ప్రారంభానికి సంబంధించిన తుది ఏర్పాట్లు కొనసాగుతున్నాయని, ఈ నెల 10న యూనిట్‌ను విజయవంతంగా ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జెన్కో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ) ఆదినారాయణ 'దిశ'కు ఫోన్ ద్వారా తెలిపారు.

**విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరగనుంది**



4వ యూనిట్ పునఃప్రారంభంతో శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి సామ-ర్థ్యం మరింత పెరగనుంది. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుంది. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో మొత్తం ఆరు యూనిట్లు ఉన్నాయి. నాలుగో యూనిట్ కూడా అందుబాటులోకి రావడంతో ఒక్కో యూనిట్ ద్వారా 150 మెగావాట్ల చొప్పున మొత్తం 900 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం కేంద్రానికి అందుబాటులోకి రానుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

# రాష్ట్రంలో నీటి కటకట ఉంది

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను పదేళ్ల పాలనలో తీవ్రంగా నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ నాయకులకు, నీటి పంపిణీపై మాట్లాడే ఏ నైతిక హక్కు లేదని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కటకట ఉన్నప్పటికీ.. ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఆల్మట్టి, జూరాల ప్రాజెక్టుల నుంచి నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ఆయకట్టుకు తాగు, సాగు నీటిని నిరంతరం పంపిణీ చేస్తోందని స్పష్టం చేశారు. పరిస్థితులు ఇలా ఉంటే.. కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికి, ప్రచారం కోసమే ముఖ్యమంత్రి సొంత జిల్లాలో నీళ్లు వదలడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు ఆర్భాటాలు, చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులను ప్రారంభిస్తే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 4.60 లక్షల ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టులను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కల్వకుర్తి కింద 25 టీఎంసీల నీటిని ఇచ్చే పనులను ఎందుకు పూర్తి చేయలేదో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నీళ్లు ఇవ్వకపోతే పంటలు కొనడం, బోనస్ చెల్లించడం నుంచి తప్పించుకోవచ్చనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందనడం పూర్తిగా అబద్ధమని తోసిపుచ్చారు. ప్రజలు పదేళ్ల బీఆర్ఎస్ వైఫల్యాలను చూసే వారిని ఇంటికి పంపించారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటితో పాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల



పథకాన్ని 100 శాతం పూర్తి చేసి, కృష్ణా జలాలను జిల్లా రైతులకు పూర్తిస్థాయిలో అందించి తీరుతామని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# మంత్రి శ్రీధర్ బాబు కీలక ప్రకటన

## త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాలనను మరింత వేగవంతం, పారదర్శకం చేసేందుకు ప్రభుత్వం అనేక విప్లవాత్మక డిజిటల్ కార్యక్రమాలను చేపడుతోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభ, మండలి వ్యవహారాలను సంపూర్ణంగా డిజిటలైజ్ చేస్తూ త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. GOVconnect, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (మీసేవ) సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన "ఏఐ ట్రాన్స్‌ఫార్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)"ను ప్రారంభించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ప్రసంగించారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ శాఖల్లో పేపర్ లెస్ పాలనకు పెద్దపీట వేస్తున్నామని, నకిలీ పత్రాలకు తావులేకుండా భద్రమైన బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల సేవలను త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల సాధికారత లక్ష్యంగా టీ-ఫైబర్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షలకు పైగా గ్రామీణ కుటుంబాలకు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు ఎలాంటి శ్రమ లేకుండా ప్రభుత్వ పౌర సేవలను నేరుగా వారి ఇంటి ముంగిటకే చేరవేసే వ్యవస్థను త్వరలోనే ప్రారంభిసామన్నారు. పాలనా వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20కి పైగా ప్రధాన ప్రభుత్వ శాఖలను ఒకే వేదికపైకి తెచ్చి, పథకాల అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్ బోర్డును రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్య కుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డాక్టర్ దేవేష్ త్యాగి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్.. వరుణ యాగం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి నదులు, జలాశయాలు, చెరువులు జలకళ సంతరించుకోవడంతో పాటు పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 10వ తేదీన వరుణ యాగం నిర్వహించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఎంఎస్ఎన్ రెడ్డి తెలిపారు. యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిద్ధాంతుల సూచనల మేరకు ఆగస్టు 10న వరుణ యాగానికి శుభ ముహూర్తంగా నిర్ణయించారు. నాగార్జునసా గర్ డ్యామ్ సమీపంలోని విజయవిహార్ ప్రాంగణంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువులు నిర్వహించనున్నారు.

**వేదపండితుల ప్రత్యేక సంకల్పం..**

ఈ సందర్భంగా రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవాలని, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కృష్ణా, గోదావరి నదులు, చెరువులు నిండిపోవాలని, రైతాంగానికి మేలు కలగాలని వేదపండితులు ప్రత్యేక సంకల్పంతో యాగం నిర్వహిస్తారు. రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వరుణ యాగం జరగనుంది. సాయంత్రం జరిగే మహాపూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించ సున్నట్టు అధికారులు తెలిపారు.

# సీఎంకు కేటీఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి అనేక నేతన్నల కోసం ప్రత్యేకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించిన కేటీఆర్, వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి నేతన్నలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం కేవలం ఉత్సవాలు నిర్వహించుకునే రోజు కాదని, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కలిసి చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా చేనేత రంగానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55,072 మంది చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తూ 'నేతన్న బీమా' అమలు చేశామని తెలిపారు. ఒక్కో కార్మికుడికి ప్రీమియం ప్రభుత్వమే భరించిందని వివరించారు.

**'నేతన్నకు చేయూత'..**

'నేతన్నకు చేయూత' పథకం ద్వారా కార్మికుల పొదుపును ప్రోత్సహిస్తూ, కార్మికుడు ప్రతినెల రూ.1,200, అనుబంధ కార్మికుడు రూ.800 చెల్లిస్తే ప్రభుత్వం రూ.4,000 వరకు వాటా జమ చేసే వినూత్న విధానాన్ని అమలు చేశామని తెలిపారు. అదేవిధంగా చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, 20 శాతం మార్కెటింగ్ రిబేట్ అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాల యూనిఫారాల తయారీ వంటి భారీ ప్రభుత్వ ఆర్డర్లను చేనేత రంగానికే అప్పగించి వేలాది కుటుంబాలకు నిరంతర ఉపాధి కల్పించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేసిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రస్తుతం 'నేతన్న బీమా' అమలు కావడం లేదని, 'నేతన్నకు చేయూత' పథకం చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయని పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయని, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ప్రభుత్వ ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వ ఆర్డర్లు అన్ని కమిషన్ల కోసం ప్రవేట్ సంస్థలకు వ్యక్తులకు అప్పజెప్తున్నారని విమర్శించారు. నేతన్నల కోసం గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయనీ కేటీఆర్ ప్రశ్నించారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి అందరినీ మోసం చేసినట్లుగానే నేతన్నలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ అన్నారు. చేనేత భరోసా కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, లక్ష రూపాయల వరకు వ్యక్తిగత రుణమాఫీ, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, కేంద్రం విధిస్తున్న 5 శాతం జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నలకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు.

**చేనేత రంగానికి కేంద్రం తీవ్ర అన్యాయం..**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తివేయడం, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. పార్టీలు వేరైనా చేనేత విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిలో ఎలాంటి తేడా లేదని ఆరోపించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో రాష్ట్రంలోని నేతన్నల తరపున ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చేనేత కళాకారుల కోసం ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, గతంలో రద్దు చేసిన అన్ని పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలను వెంటనే తిరిగి ప్రారంభించి బకాయిలు విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "మన చేనేత... మన గౌరవం. నేతన్న బతికితేనే చేనేత బతుకుతుంది. చేనేత బతికితేనే మన సంస్కృతి, మన స్వాభిమానం సజీవంగా ఉంటాయి. ఇప్పటికైనా మోసపూరిత వైఖరిని వీడి నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలి" అని కేటీఆర్ తన లేఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# ఎన్నారైలకు భట్టి పిలుపు

## పెట్టుబడులకు తెలంగాణే ఫస్ట్ ఛాయిస్ కావాలి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రాన్ని తమ పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు తొలి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా శాన్ ఫ్రాన్సిస్కోలో భారత కాన్సుల్ జనరల్ కె. శ్రీకర్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు సమావేశంలో ఆయన మాట్లాడారు. బే ఏరియాలోని ఐటీ, వైద్యం, మానవ వనరుల రంగాలకు చెందిన ప్రముఖ ఎన్నారైలు, వ్యాపార నాయకులు హాజరైన ఈ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు, భవిష్యత్ ప్రణాళికలను డిప్యూటీ సీఎం సుదీర్ఘంగా వివరించారు. హైదరాబాద్ నగరం టెక్నాలజీ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ సర్వీసెస్ రంగాల్లో భారతదేశంలోనే అగ్రగామి కేంద్రంగా ఎదుగుతోందని ఆయన గుర్తుచేశారు. పారదర్శక పరిపాలన, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో ప్రభుత్వం పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తోందని తెలిపారు. నూతన ఆలోచనలను వ్యాపారాలుగా మార్చడంలోనూ, నాణ్యమైన ఉపాధి కల్పనలోనూ పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అడుగులు వేయాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో చేపడుతున్న కీలక ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. మూసీ నది పునరుద్ధరణ, సమగ్ర పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు భట్టి విక్రమార్క చెప్పారు. తెలంగాణ యువతను అంతర్జాతీయ స్థాయి పోటీకి సన్నద్ధం చేసేందుకు ప్రతిష్ఠాత్మక యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు అత్యాధునిక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసస్తున్నామని వెల్లడించారు. అంతకుముందు మాట్లాడిన కాన్సుల్ జనరల్ శ్రీకర్ రెడ్డి.. ప్రవాస భారతీయులు, ప్రభుత్వాల మధ్య భాగస్వామ్యాలు బలోపేతం కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఐఓసీ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్యాభివృద్ధిపై ఎన్నారై ప్రతినిధులతో నిర్వహించిన ఈ చర్చలు ఎంతో అర్థవంతంగా సాగాయి.

# తెలంగాణలో ఏ పార్టీతోనూ పొత్తుల్లేవ్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పొత్తులపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తో సమావేశం అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీలో తమకు ఎవరితోనూ పొత్తు ఉండదని అన్నారు. జనసేన విషయం అధిష్టానం చూసుకుంటుందని చెప్పారు. జనసేన జాతీయ స్థాయిలో ఎన్డీఏలో భాగస్వామి అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, ఆరుగ్యారెంటీలపై పోరాటం చేస్తామని అన్నారు. బీజేపీలో పాత, కొత్త నేత అనే తేడా ఉండదని తెలిపారు. చాలా మంది ఇతర పార్టీల నుండి బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎన్నికలు మరో రెండున్నరేళ్లు ఉండటం వల్ల కొంత సమయం తీసుకుంటున్నారని చెప్పారు. తమకు చాలా చోట్ల అభ్యర్థులు ఉన్నారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఒడిశా, బెంగాల్ లో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, అక్కడి కంటే తెలంగాణలో పార్టీ సంస్థాగతంగా బలంగా ఉందన్నారు. డీలిమిటేషన్ బిల్లుపై కొందరు కాంగ్రెస్ నాయకులు సైతం మద్దతు ఇచ్చే అవకాశం ఉందన్నారు. డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందుతుదని అన్నారు. బీజేపీ నాయకుల మధ్య భేదాభిప్రాయాలు ఉండవచ్చని, కానీ విభేదాలు లేవని అన్నారు.

# నీటి హక్కులను కాపాడండి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 85 ప్రకారం తెలంగాణకు చట్టబద్ధంగా లభించిన నీటి హక్కులను పరిరక్షించేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. జీఆర్ఎంబీ (గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) నిర్వహించనున్న 18వ సమావేశ అజెండాలోని 18.3.1, 18.3.6, 18.3.11 అంశాలను వెంటనే ఉపసంహరించాలంటూ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధంగా ఆమోదించిన తెలంగాణ ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల అనుమతులను తిరిగి సమీక్షించే ప్రయత్నమే ఈ అజెండా అంశాల ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం రెండు రాష్ట్రాల మధ్య వివాదం కాదని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియ విశ్వసనీయత, చట్టబద్ధతకు సంబంధించిన అంశమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణకు చెందిన ఆయా సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ), కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అన్ని సాంకేతిక, జలవిజ్ఞాన, ఇంజినీరింగ్, పర్యావరణ, చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే అనుమతులు మంజూరు చేశాయని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వంలోని సమర్థ అధికార సంస్థలు ఇచ్చిన చట్టబద్ధ అనుమతులను జీఆర్ఎంబీ వంటి అనుబంధ సంస్థలు తిరిగి సమీక్షించే లేదా రద్దు చేసే అధికారం లేదని ఆయన స్పష్టం చేశారు. జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్ణయాలను జీఆర్ఎంబీ పునఃసమీక్షిస్తే కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థల అధికారాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**మరోసారి పరోక్షంగా తెరపైకి..**

జీఆర్ఎంబీ అజెండాలో కాళేశ్వరం, చౌటుపల్లి హనుమంతరెడ్డి, ముక్తేశ్వరం, చనకా-కొరట (రుద్ర), మోదికుంటవాగు, కడెం-గూడెం, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం వంటి తెలంగాణ కీలక ప్రాజెక్టులకు ఇప్పటికే లభించిన అనుమతులను తిరిగి పరిశీలించే అంశాలు ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ నిర్దేశిత చట్టబద్ధ ప్రక్రియ పూర్తిచేసుకుని కేంద్ర అనుమతులు పొందాయని వివరించారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ నీటి వాటాను గుర్తిస్తూ జీఆర్ఎంబీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తీసుకున్న గత నిర్ణయాలను కూడా ఆయన లేఖలో ప్రస్తావించారు. ఈ అంశాలన్నీ ఇప్పటికే కేంద్ర జల సంఘం పరిశీలించి అనుమతులు ఇచ్చినందున వాటిని మరోసారి పరోక్షంగా తెరపైకి తీసుకురావడం సరికాదని పేర్కొన్నారు. రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అంతర్ పరివాహక ప్రాంతాలకు నీటి మళ్లింపు చేపట్టే ముందు ఆయా పరివాహక ప్రాంత ప్రాజెక్టుల అవసరాలు తీర్చాలని నమోదైన అంశాన్ని కూడా హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే సీడబ్ల్యూసీ జలవిజ్ఞాన పరంగా అంగీకారం తెలిపిన సమ్మక్క సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి మిగిలిన చట్టబద్ధ అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఇప్పటికే మంజూరైన అనుమతులను తిరిగి తెరపైకి తీసుకురావడం వల్ల భవిష్యత్తులో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం జారీ చేసే ప్రతి చట్టబద్ధ అనుమతిపై అనిశ్చితి ఏర్పడుతుందని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి, తాగునీటి భద్రతతో పాటు తెలంగాణలోని లక్షలాది మంది రైతుల ప్రయోజనాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

**కేంద్ర మంత్రిని హరీశ్‌రావు కోరిన ప్రధాన అంశాలు..**

జీఆర్ఎంబీ 18వ సమావేశ అజెండాలోని 18.3.1, 18.3.6, 18.3.11 అంశాలను వెంటనే ఉపసంహరించాలని ఆదేశించాలి.

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం ఇప్పటికే మంజూరు చేసిన టీఏసీ అనుమతులను తిరిగి సమీక్షించే ప్రతిపాదనలను జీఆర్ఎంబీ పరిగణనలోకి తీసుకోకుండా చూడాలి.

సమ్మక్క సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంతో పాటు తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఇతర అర్హత కలిగిన సాగునీటి ప్రాజెక్టులకు మిగిలిన చట్టబద్ధ అనుమతులను వేగంగా మంజూరు చేయాలి.

సకాలంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 నిబంధనలు పరిరక్షించబడటంతో పాటు తెలంగాణ నీటి హక్కులు కాపాడబడతాయని, కేంద్ర ప్రభుత్వ చట్టబద్ధ అనుమతుల ప్రక్రియ విశ్వసనీయత కూడా నిలబడుతుందని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు.

# ఇక నుంచి సహించను



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో రహదారుల నిర్మాణ పనుల్లో మైనింగ్ శాఖ ఎదుర్కొంటున్న సమస్యలు, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సంయుక్తంగా నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమీక్షలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి, TGMDC మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఆర్ అండ్ బీ సీఈ (హ్యామ్ రోడ్లు) బీవీ రావులతో పాటు మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో మైనింగ్ కాంట్రాక్టర్లు తమ ఇబ్బందులను మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రులు.. రోడ్డు పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ అధికారులు 10 రెట్ల వరకు భారీగా పెనాల్టీలు విధించడం ఏమాత్రం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన మైనింగ్ అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ మంత్రి వివేక్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. రూ.5 కోట్ల విలువైన అంశానికి ఏకంగా రూ. 54 కోట్లు పెనాల్టీ విధించడం అత్యంత దారుణమని ఆయన మండిపడ్డారు. కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ ప్రకారమే పేమెంట్లు చేస్తారని, అక్రమ మైనింగ్ చేసేవారిని వదిలిపెట్టి అమాయక చిన్న కాంట్రాక్టర్లపై అధికారులు దౌర్జన్యంగా వ్యవహరించడం తగదని కోమటిరెడ్డి స్పష్టం చేశారు.

**2028 నాటికి అద్దం లాంటి రోడ్లే లక్ష్యం..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హ్యామ్ మోడల్లో రోడ్ల నిర్మాణాన్ని అత్యంత అట్టహాసంగా ప్రారంభించుకున్నామని, 2028 ఆగస్టు నాటికి తెలంగాణ వ్యాప్తంగా అద్దం లాంటి, ఆదర్శవంతమైన రోడ్లు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. రహదారుల నిర్మాణానికి ఇసుక, మట్టి, మెటల్ అత్యంత అవసరమని, మెటల్ పర్మిషన్ల పేరుతో అధికారులు కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేయవద్దని ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి లేవనెత్తిన అంశాలపై మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించారు. కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ అధికారులను వివేక్ ఆదేశించారు.

# మంత్రి దామోదర సీరియస్



**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇలాఖాలో ఫేక్ డాక్టర్ బాగోతం వెలుగుచూసింది. జోగిపేట ఏరియా ఆస్పత్రిలో నకిలీ డాక్టర్ వ్యవహారం బయటపడింది. ప్రభుత్వ డాక్టర్ రమేశ్ తన స్థానంలో ప్రైవేట్ వైద్యుడితో ఉద్యోగం చేయిస్తున్నారు. డిప్యూటీ సివిల్ సర్జన్ జనరల్ మెడిసిన్ డాక్టర్ రమేశ్ స్థానంలో ప్రైవేటు డెంటల్ వైద్యుడు రవి డాక్టర్‌గా చెలామణి అవుతున్నారు. వైద్యారోగ్య శాఖ విచారణలో ఈ విషయం బయడపింది. ఈ ఘటనపై మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్ అయ్యారు. డ్యూటీకి డుమ్మా కొడుతూ తన స్థానంలో వేరొకరితో డ్యూటీ చేయిస్తున్న రమేశ్‌ను సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శిని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.

# సంపాదకీయం




# తమిళనాడులో ప్రతీకారమే రాజకీయమా..?

దేశపు దక్షిణ కొసన ఉన్న రాష్ట్రం తమిళనాడు. ఇక్కడ అరవై ఏళ్లుగా ద్రవిడ సిద్ధాంతమే ఆలంబనగా రెండే పార్టీలు చక్రం తిప్పుతూ వచ్చాయి. అన్నాదురై శిష్యులుగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన కరుణానిధి, ఎంజీఆర్.. చివరకు అభిప్రాయభేదాలతో రాజకీయంగా వేర్వేరు దారులు ఎంచుకున్నారు. కరుణానిధి డీఎంకేలో కొనసాగగా.. ఎంజీఆర్ అన్నాడీఎంకే పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్నారు. ఎంజీఆర్ ఉన్నంతవరకు అధికారానికి దూరమైన కరుణానిధి.. ఆ తర్వాత ఎంజీఆర్ వారసత్వాన్ని జయలలిత తీసుకోవటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పట్నుంచీ జయలలిత, కరుణానిధి మధ్య రాజకీయ వైరానికి మించి.. వ్యక్తిగత పగ, ప్రతీకారం, పంతం పెద్దపీట వేసుకుని కూర్చున్నాయి. ఈ కారణంగానే మూడు దశాబ్దాల క్రితమే తమిళనాడులో ప్రతీకారాలు, ప్రతిపక్ష నేతల అరెస్ట్‌కు బీజం పడింది. అది అలాగే కొనసాగి.. ఇప్పుడు విజయ్ రూపంలో కొత్త రాజకీయ శక్తి వచ్చాక కూడా.. ప్రతిపక్ష నేతగా ఉన్న ఉదయనిధి అరెస్ట్‌కు దారితీసిందనే చర్చ జరుగుతోంది. 1996లో తమిళనాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జయలలితను సీఎంగా ఉన్న కరుణానిధి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జైలు పాలు చేశారు. ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురికావడంతో, జయలలితతో పాటు ఆమె సన్నిహితురాలు వి.కె. శశికళను కూడా అరెస్ట్ చేసి సుమారు నెల రోజుల పాటు జైలులో ఉంచారు. పోయెస్ గార్డెన్‌లోని జయ నివాసంలో జరిపిన సోదాల్లో భారీ ఎత్తున బంగారు ఆభరణాలు, వేల సంఖ్యలో పట్టుచీరలు, వందలాది చెప్పుల జతలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ అవమానానికి ప్రతీకారంగానే, తిరిగి 2001లో అధికారంలోకి వచ్చిన వెంటనే జయలలిత అర్ధరాత్రి పూట కరుణానిధిని అత్యంత నాటకీయంగా అరెస్ట్ చేయించారు. దేశ రాజకీయ చరిత్రలోనే అత్యంత సంచలనాత్మకమైన సంఘటనలలో ఇది ఒకటిగా నిలిచింది. కరుణ అరెస్ట్‌కు ప్రధాన కారణం ఫ్లైఓవర్ల కుంభకోణం. చెన్నైలో రూ. 115.50 కోట్ల వ్యయంతో చేపట్టిన 10 ఫ్లైఓవర్ల నిర్మాణంలో రూ. 12 కోట్ల మేర అవినీతి మరియు అధికార దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలపై చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.సి.టి. ఆచార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ బ్రాంచ్ పోలీసులు కరుణానిధిని అరెస్ట్ చేశారు. పోలీసులు చెన్నై గోపాలపురంలోని కరుణానిధి నివాసంలోకి చొరబడ్డారు. 78 ఏళ్ల వృద్ధుడైన కరుణానిధిని కనీసం బట్టలు మార్చుకోవడానికి కూడా సమయం ఇవ్వకుండా, మంచంపై నుండి బలవంతంగా ఈడ్చుకెళ్లారు. కరుణానిధిని రక్షించేందుకు ప్రయత్నించిన అప్పటి కేంద్ర మంత్రులు మురసోలి మారన్, టి.ఆర్. బాలులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. స్వతంత్ర భారత చరిత్రలో విధుల్లో ఉన్న కేంద్ర క్యాబినెట్ మంత్రులను అరెస్ట్ చేయడం ఇదే మొదటిసారి. కరుణానిధిని అరెస్ట్ చేసిన విధానంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు దేశవ్యాప్తంగా రాజకీయ ఒత్తిడి పెరగడంతో, జయలలిత ప్రభుత్వం జూలై 4న మానవీయ కోణంలో కరుణానిధిని విడుదల చేసింది. 1996లో జయలలితను కరుణానిధి ప్రభుత్వం అరెస్ట్ చేయించినందుకు ప్రతీకారంగానే, జయలలిత తిరిగి అధికారంలోకి రాగానే ఈ అర్ధరాత్రి అరెస్ట్ ప్లాన్ చేశారనేది బహిరంగ రహస్యం. ఆ తర్వాత 2006లో డీఎంకే తిరిగి అధికారంలోకి వచ్చాక ఈ కేసును పూర్తిగా పక్కనబెట్టేశారు. ఇక్కడ జయలలిత, కరుణానిధి ఇద్దరూ రాజకీయాల్లో హేమాహేమీలే. కంటి చూపుతో తమ తమ పార్టీలను శాసించినవారే. వ్యక్తిగతంగా నేతలిద్దరికీ ఫాలోయింగ్‌కూ కొదువలేదు. సాధారణంగా ఎవర్నీ లెక్కచేయని మనస్తత్వం ఉన్న ఈ ఇద్దరు నేతలూ. ప్రతీకారం విషయంలో మాత్రం ఒకేలా ఆలోచించడం యాదృచ్ఛికం కానే కాదు. ఇద్దరూ వ్యూహాత్మకంగా, ప్రత్యర్థిని మానసికంగా దెబ్బకొట్టి.. ప్రతిపక్షాన్ని బలహీనపరచాలనే ఉద్దేశంతో పన్నిన వ్యూహం.. తమిళ రాజకీయాల్లో ఒక దురదృష్టకర సంప్రదాయానికి పునాది వేసిందనే చెప్పాలి. ఈ ఇద్దరు నేతలు మొదలుపెట్టిన సంప్రదాయం వారు దివంగతులైన తర్వాత కూడా యథాతథంగా కొనసాగుతుండటం.. తమిళనాడుతో పాటు మొత్తంగా దేశ ప్రజల్ని ఆశ్చర్యపరుస్తోంది. తొలి నుంచీ కరుణానిధి కుటుంబం డీఎంకేను నడిపిస్తుండటంతో.. జయలలిత తన ప్రతీకారాన్ని కరుణానిధితో వదిలిపెట్టలేదు. కరుణ అరెస్ట్ జరిగిన దశాబ్దం తర్వాత ఆయన కుమారుడు ఎంకే స్టాలిన్‌ను కూడా అరెస్ట్ చేయించారు. ఈసారి డీఎంకే శ్రేణులతో కలిసి ధర్నాకు దిగిన స్టాలిన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జయలలిత నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం హయాంలో డీఎంకే నేతలపై వరుసగా భూకబ్జా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, దానికి నిరసనగా డీఎంకే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. ఈ ప్రదర్శనలో వేల మంది కార్యకర్తలు పాల్గొనడంతో, అనుమతి లేదనే కారణంతో పోలీసులు స్టాలిన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులను అదుపులోకి తీసుకుని, ఆ తర్వాత విడిచిపెట్టారు. అదే ఏడాది డిసెంబర్ 2011లో కూడా ఆయనపై మరో భూకబ్జా కేసు నమోదు కావడంతో రాజకీయం మరింత వేడెక్కింది. ఇక్కడ జయలలిత, కరుణానిధి మాజీ ముఖ్యమంత్రుల హోదాలో అరెస్ట్ అయితే.. ఎంకే స్టాలిన్ మాత్రం మాజీ డిప్యూటీ సీఎం హోదాలో అరెస్ట్ అయ్యారు. అయితే అరెస్టైన సమయంలో ఆయా నేతలు.. తమ పార్టీల తరపున ప్రతిపక్షంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇంకా సూటిగా చెప్పాలంటే అప్పటి ప్రభుత్వాల్ని ఇరుకున పెడుతున్నారు. దీంతో కొడితే ఏనుగు కుంభస్థలం మీద కొట్టాలనే ఉద్దేశంతో.. ప్రతిపక్ష నేతల్నే అరెస్ట్ చేయడం ద్వారా.. నిరసనల్ని సహించేది లేదనే కఠిన సంకేతం పంపటమే లక్ష్యంగా ఆయా సందర్భాల్లో తమిళ నేతలు వ్యవహరించారు. జయలలిత అరెస్ట్ అయినప్పుడు వింతగా చెప్పుకున్న రాజకీయ వర్గాలు.. కరుణానిధి అరెస్ట్ జరిగినప్పుడు.. అది రాజకీయ ప్రతీకారమేననే నిర్ధారణకు వచ్చేశాయి. ఇక ఎంకే స్టాలిన్ అరెస్ట్ అయితే.. తమిళనాడులో మామూలేగా అని సరిపెట్టుకున్న దాఖలాలున్నాయి. ఆ స్థాయిలో తమిళనేతలు ప్రతీకారాన్ని తమ రాజకీయ వ్యూహంలో భాగం చేసి.. ఆ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోవద్దని మిగతా దేశానికి అలవాటు చేశారు. తమిళనాడులో ఏం జరిగినా రాజకీయమేనని.. ద్రవిడ సిద్ధాంతం పునాది మీదే రెండు పార్టీలూ ఏర్పడటంతో కూడా.. పంతాలు, ప్రతీకారాలకు ఫ్రంట్ సీట్ దక్కిందనే చర్చ కూడా లేకపోలేదు. ఏదేమైనా తమిళ తంబీలు మాత్రం దశాబ్దాలుగా ప్రతిపక్ష నేతల అరెస్ట్‌లు చూస్తూనే ఉన్నారు. అరెస్ట్‌కు ఏ కారణాలు చెప్పినా.. అసలు కారణం తమకు తెలుసులే అని సరిపెట్టుకుంటున్నారు. ఇంకా చెప్పాలంటే.. డీఎంకే, అన్నాడీఎంకే క్యాడర్ కూడా తమ పార్టీలు అధికారంలోకి వచ్చినప్పుడు.. ప్రత్యర్థి పార్టీ నేతల్ని అరెస్ట్ చేయాలని కోరుకున్న మాట కూడా వాస్తవం. తమిళ సమాజం రెండు పార్టీల మధ్య చీలిపోవడంతో.. మెజార్టీ జనాభా ఈ అరెస్టుల్ని ఫక్తు రాజకీయంగానే చూసే దృష్టి కోణం అలవడింది. పైగా అరెస్ట్‌లపై తాత్కాలిక చర్చలే కానీ.. అంతకు మించి ఆలోచించటానికి ఇష్టపడకపోవడమే తమిళనాడులో అసలు సిసలు రాజకీయం. కాకపోతే ప్రతిసారీ అరెస్ట్ జరిగినప్పుడల్లా.. గత చరిత్రను తవ్వటం మాత్రం షరా మామూలైపోయింది.



# మార్పులు ఎలా ఉండబోతున్నాయి?

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జెన్‌జీ విద్యార్థులు సాగించిన ఉద్యమంపై సర్వత్రా పొగడ్తల వర్షం కురుస్తోంది. హింసాత్మక ఘటనలకు చోటు లేకుండా శాంతియుత మార్గంలో 36 రోజులపాటు విద్యార్థులు దీక్షను సాగించడం.. చివరకు మూడు ప్రధాన డిమాండ్లను సాధించడంపై అంతటా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. శాంతి భద్రతల సమస్య ఎదుర్వలేదు. మహాత్ముడి అహింస మార్గంలోనే విద్యార్థి ఉద్యమం కొనసాగింది. 36 రోజులుగా దీక్ష కొనసాగినా.. ఎక్కడా కూడా ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదు. దీంతో విద్యార్థి ఉద్యమానికి అంతటా మద్దతు లభించింది. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ చేస్తే, జాతీయ జెండాను నేలపై పడిపోకుండా పలువురు విద్యార్థులు పట్టుకొంటున్న వీడియోలు అందరిలో దేశభక్తిని రగిల్చాయి. ఇది ఉద్యమ తీవ్రతను మరింత పెంచాయి. కొన్నేళ్లుగా యువత ఉద్యమాలకు దూరంగా ఉంటోంది. జెన్‌జీ పూర్తిగా కెరీర్ మీదే ఫోకస్ చేసింది. మొదటి నుంచి విద్యార్థి ఉద్యమం ఎంతో స్పష్టతతో నడిచింది. నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు, ప్రాణాలు తీసుకొన్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, లాఠీఛార్జీ చేసిన పోలీసులపై చర్యలతో పాటు విద్యార్థులపై కేసుల ఎత్తివేత.. ఇవే మూడు ప్రధాన డిమాండ్లతో చివరి వరకూ విద్యార్థులు పోరాడటం సాగించడం అందర్నీ ఆకర్షించింది. ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో విద్యార్థులు సాంకేతికతను ఓ ఆయుధంగా మలుచుకొన్నారు. సోషల్‌మీడియా సాయంతో యావత్తూ దేశ ప్రజల మద్దతును కూడగట్టారు. ఏఐతో రూపొందించిన కొన్ని ఊహాజనిత వీడియోలతో ఉద్యమ తీవ్రతను పెంచారు. విద్యార్థుల ఉద్యమానికి యావత్తూ దేశ ప్రజానీకం బాసటగా నిలిచింది. జంతర్ మంతర్‌కు వేలాదిమంది ఫుడ్ ఆర్డర్లు పెట్టారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలు, విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విజయవంతమైంది. జెన్‌జీకి నాయకత్వం వహించే నాయకత్వం లేదు. అభిజిత్ దీప్కే రూపంలో నాయకుడిగా దొరికినా...జెన్‌జీకి ఆర్గనైజేషనల్ స్ట్రక్చర్ లేదు. అభిజీత్ దీప్కేకు మాస్ అప్పీల్ లేదు. నీట్ ఉద్యమానికి కారణం ఉంది. బాధితులతో పాటు జెన్‌జీ వెల్లువలా జంతర్‌మంతర్‌కు తరలివచ్చారు. ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించారు. నీట్ ఉద్యమం అయిపోయింది. మరీ నెక్ట్స్ ఏంటి అన్న ప్రశ్నలు వస్తున్నాయి. 36 రోజుల పాటు దేశ రాజధానిలో ఉద్యమం నడిపించడం ఆషామాషీ వ్యవహారం కాదు. కాక్రోచ్ జనతా పార్టీ పిలుపుతో...ఎవరికి వారు స్వతహాగా తరలివచ్చారు. ఉద్యమంలో పాల్గొన్నారు. 36 రోజుల పాటు ఉద్యమం చేసిన జెన్‌జీ వెనుక ఎవరున్నారు ? అన్న ప్రశ్నలు వస్తున్నాయి. కేజ్రీవాల్ ఉన్నారని కొందరు ? కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయని ఇంకొందరు కామెంట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ...సీజేపీ ఉద్యమాన్ని వెనుకుండి నడపించిందని మరికొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అయితే జెన్‌జీ ఉద్యమం వెనుక ఎవరున్నా సరే...36 రోజుల మొక్కవోని దీక్షతో ఉద్యమం చేయడం మాములు విషయం కాదు. సీజేపీ జంతర్‌మంతర్ వద్ద నిరసనలు ప్రారంభించిన వెంటనే...కేంద్రం నిర్ణయం తీసుకుని ఉంటే ఆందోళనలు తారాస్థాయికి చేరి ఉండేవి కాదు. నెల రోజులకుపైగా జెన్‌జీ అంత పట్టుదలగా నిలబడటంతోనే...నీట్ ఉద్యమానికి హైప్ వచ్చింది. లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడినందునే...ఢిల్లీకి వేల మంది యువత తరలివచ్చింది. జెన్‌జీ ఉద్యమంతోనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి దేశంలో నమోదైన మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 96.88 కోట్లు. వీరిలో 18 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓటర్లు 22.78 శాతం, అంటే దాదాపు 22 కోట్ల మంది. ఇందులో 18-19 సంవత్సరాల మధ్య వయస్సుగల తొలి ఓటర్లు 1.85 కోట్లు, 20-29 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓటర్లు 19.74 కోట్లకుపైగా ఉన్నారు. 2024 ఎన్నికలకు ముందు మాత్రమే రెండు కోట్లకు పైగా కొత్త యువ ఓటర్లు ఓటరు జాబితాల్లో చేరారు. ఈ గణాంకాలు జెన్ జీ ఓటర్ల పెరుగుతున్న రాజకీయ ప్రాధాన్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఇదే ధోరణి కొనసాగితే 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి మొత్తం ఓటర్లలో జెన్ జీ వాటా 25 నుంచి 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. అంటే ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరు జెన్ జీకి చెందినవారే అయ్యే పరిస్థితి ఏర్పడనుంది. ప్రదాయంగా యువత పోలింగ్లో పెద్దఎత్తున పాల్గొనదనే అభిప్రాయం ఉండేది. అయితే జంతర్‌మంతర్ వాళ్ల చైతన్యాన్ని ప్రస్ఫుటం చేసింది. దేశంలో 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం 67.4 కాగా, 2024లో అది 65.8 శాతానికి తగ్గింది. అయినప్పటికీ అనేక రాష్ట్రాల్లో యువ ఓటర్ల భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. రాజకీయ పార్టీలు జెన్ జీ గురించి ఆలోచించాల్సిన స్థితిని కల్పించింది. నాణ్యమైన ఉన్నత విద్య, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన కోర్సులు, నైపుణ్యాధారిత బోధనను వారు కోరుకుంటున్నారు. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు, మూల్యాంకనలో లోపాలు వంటి పరిణామాలు యువతలో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తున్నాయి. యువత ఆకాంక్షలను నిర్లక్ష్యం చేసే పార్టీలకు రాజకీయంగా భారీ మూల్యం చెల్లించక తప్పదు. జెన్ జీ ఆధునిక భారతదేశాన్ని కోరుకుంటోంది. నాణ్యమైన ఉద్యోగాలు, అందుబాటులో ఉన్నత విద్య, స్వచ్ఛమైన పర్యావరణం, సమాన అవకాశాలు, పారదర్శక పాలన, సాంకేతిక పురోగతి...ఇవే వారి ప్రధాన ఆకాంక్షలు. యువతలో రాజకీయ చైతన్యం పెరిగింది. హక్కుల కోసం గొంతెత్తుతోంది. విద్యా సంస్కరణల కోసం తాము చేసే పోరాటంలో...ఇది ఆరంభం మాత్రమేనని జెన్‌జీ హెచ్చరిస్తోంది. యువత అనుకుంటే ఏం చేయగలదో మరోసారి నిరూపితమైంది. విద్యార్థుల శక్తి ఎలాంటిదో దేశం కళ్లారా చూసింది. మనసులో అసంతృప్తి, ఆగ్రహం ఉన్నా.. పలు భయాలతో ఆందోళనకు వెనుకాడిన ఎన్నో వర్గాలకు.. ఇప్పుడు ఢిల్లీలో విద్యార్థి విజయం కొత్త స్ఫూర్తి నిచ్చిందనడంలో సందేహం లేదు. ఇప్పుడు యువ భారత్...స్పష్టమైన సందేశాన్ని పంపుతోంది. జవాబుదారీతనం, రాజ్యాంగ విలువలతో కూడిన పాలనను నేటి తరం కోరుకుంటోంది. దేశంలోని జెన్‌జీ కేవలం సిద్ధాంతాలతోనే ముందుకు వెళ్లడం లేదు. అది ఆకాంక్షలతో నడుస్తోంది. ప్రతిభకు ప్రతిఫలం, సంస్థల విశ్వసనీయత, సమాన అవకాశాలు, రాజ్యాంగం కేవలం ప్రసంగాలలోనే కాకుండా పాలనలో గౌరవించే దేశాన్ని ఈ తరం కోరుకుంటోంది. గణతంత్ర భవిష్యత్తుపై వారికి ప్రగాఢమైన శ్రద్ధతో ప్రభుత్వాన్ని కఠినమైన ప్రశ్నలు అడుగుతున్నారు. కేవలం ప్రశ్నలు అడగటమే అజెండాగా పెట్టుకోవడం లేదు. దానికి సరైన సమాధానాలు చెప్పేవరకూ వదిలి పెట్టడం లేదుఉపాధి అవకాశాల కొరత, ఆర్థిక మందగమనం, పెరుగుతున్న జీవన వ్యయం వంటి సమస్యలు యువత ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయి. ఫలితంగా అనేక ప్రాంతాల్లో ప్రతిపక్షాలకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఈ పరిణామం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. జెన్‌జీ ఓటర్లు ఏ ఒక్క రాజకీయ పార్టీకి శాశ్వత మద్దతుదారులు కాదు. తమ జీవితాలను ప్రభావితం చేసే వాస్తవ సమస్యల ఆధారంగానే...రాజకీయ నిర్ణయాలు తీసుకుంటున్నారు. జెన్‌జీ తరం ముందున్న అతిపెద్ద సమస్య నిరుద్యోగం. ఉన్నత విద్య పూర్తి చేసినా, నైపుణ్యాలు సంపాదించినా నాణ్యమైన ఉద్యోగాలు దొరకక లక్షలాది మంది యువత నిరాశలో ఉన్నారు. వివిధ అధ్యయనాల ప్రకారం యువ నిరుద్యోగిత 15 నుంచి 25 శాతం మధ్య నమోదవుతోంది. అందుకే ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, పారదర్శక నియామక వ్యవస్థలు ఈ తరానికి అత్యంత ప్రాధాన్య అంశాలుగా మారాయి. విద్యా వ్యవస్థ కూడా యువత ఆందోళనల్లో కీలక స్థానం సంపాదించింది. బలమైన ఆశలు, ఆకాంక్షలతో ఎలుగెత్తిన విద్యార్థులు.. తమ ఆలోచనలకు ఎంతటి బలం ఉంటుందో.. ఎంతటి శక్తివంతమైన కార్యాచరణ తీసుకోగలమో అనేది చేసి చూపించారు. మరీ ముఖ్యంగా ఏం చేసినా చెల్లిపోతుందనుకునే ప్రభుత్వాల వైఖరి మారి తీరాల్సిందేనని గట్టిగా చెప్పారు. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు, ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. అందుకే సంప్రదాయ రాజకీయ పార్టీలతో విసిగి వేసారిన జెన్‌జీ.. ప్రస్తుత నేతలతో లాభం లేదని ఓ నిర్ధారణకు వచ్చి.. కొత్త శక్తిగా రంగప్రవేశం చేస్తున్నారు. యువ ఓటర్లు ఎక్కువగా ఎన్నికలను ప్రభావితం చేయవచ్చు. భవిష్యత్తులో భారత ప్రజాస్వామ్యంలో జెన్ జీ అత్యంత ప్రభావవంతమైన శక్తులలో ఒకటిగా మారవచ్చు. ప్రత్యేకించి సంప్రదాయ పార్టీలు నిరుద్యోగం, అవినీతి, వేగంగా మారుతున్న తరం ఆకాంక్షలను పరిష్కరించడంలో విఫలమైతే.. జెన్‌జీ తరహా రాజకీయం ముందుకొస్తుందనటానికి సందేహించాల్సిన పనేం లేదు. ఏతావాతా ఈ దేశ మౌలిక విలువలపై నిర్లక్ష్యం వహిస్తే.. తాము చూస్తూ ఊరుకునేది లేదని జెన్‌జీ గట్టిగా నినదిస్తోంది. సంప్రదాయ పార్టీలు దేశవ్యాప్త ఉద్యమాల కోసం నెలల తరబడి కసరత్తు చేస్తాయి. కానీ జెన్‌జీ మాత్రం అవన్నీ పాత పద్ధతులని తీసిపారేసింది. ఒక్క వాట్సాప్ మెసేజ్, ఒక్క ఫేస్‌బుక్ పోస్ట్‌తోనే వేలు, లక్షలు, కోట్ల మందిని కదిలిస్తోంది. జెన్‌జీ ఉద్యమం సందర్భంగా.. దేశప్రజలు రాజీలేని వైఖరి చేశారు. తాము మొదట్నుంచీ ఏం అడుగుతున్నామో.. అది చేసేదాకా వెనక్కితగ్గేది లేదని విద్యార్థులు నిరూపించారు. దేశ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంతోనే...విద్యార్థులు ఢిల్లీకి వచ్చారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్, సీబీఎస్‌ఈ, సీయూఈటీ-యూజీ పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై ఆందోళన చేశారు. ఈ నిరసనల ద్వారా విద్యా వ్యవస్థలో సంస్కరణలు వస్తాయని ఆశిస్తున్నారు. మన దేశం ఇప్పుడు ఒక కొత్త రాజకీయ శక్తి ఆవిర్భావానికి సాక్ష్యమిస్తోంది. అ శక్తి ఒక రాజకీయ పార్టీ కాదు.. జెన్‌జీ అనే దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగిసిన కొత్త తరంగం. పరీక్షలలో అవకతవకలు, నిరుద్యోగం, కొరవడిన పారదర్శకత, జవాబుదారీతనం వంటి సమస్యలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా ఏకమై ధ్వజమెత్తారు. ఇది కేవలం ఒకే ఒక్క సంఘటనపై కలిగిన ఆగ్రహానికి మించి మరింత లోతైన విషయాన్ని ప్రతిబింబిస్తోంది. అన్యాయం జరిగిందని భావించినప్పుడు మౌనంగా ఉండటానికి ఇష్టపడని ఒక తరం ఆవిర్భావానికి ఇది సంకేతం. నేటి విద్యార్థులు విజ్ఞానవంతులు, ధైర్యవంతులు. వారు పాలనలో నాణ్యత, ప్రభుత్వ విద్య భవిష్యత్తు, తమకు అందుబాటులో ఉన్న అవకాశాల గురించి సమంజసమైన ప్రశ్నలను సూటిగా అడుగుతున్నారు. అంతేకాదు ఫక్తు రాజకీయ పోరాటాల మాదిరిగా కొన్ని రోజులు హడావుడి చేసి ఊరుకునే రకం తాము కాదని, పట్టు పడితే.. చివరివరకూ నిలబడి తాడో పేడో తేల్చుకుంటామని జెన్‌జీ సగర్వంగా చాటుతోంది. స్వాతంత్రోద్యమ కాలం నుంచీ కాలానుగుణంగా యువత కదం తొక్కుతూనే ఉంది. తిరుగులేని పోరాటాలతో ఎప్పటికప్పుడు అనుకున్నది సాధించుకుంటూ వస్తోంది. కాకపోతే ప్రైవేటీకరణ తర్వాత కెరీర్‌పై ఫోకస్ పెట్టి.. ఉద్యమాలకు కాస్త విరామం ఇచ్చింది. దీంతో సంప్రదాయ పార్టీలన్నీ విద్యార్థి విభాగాలను నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవం. అందుకే కొన్నాళ్లుగా ఎన్నికల మ్యానిఫెస్టోల్లోనూ యువతకు సంబంధించిన అంశాలు అలంకారప్రాయంగానే కనిపిస్తున్నాయి. వాటి అమలు గురించి నిలదీసేవారు లేకపోవడం లోటుగానే ఉంది. సరిగ్గా ఇలాంటి సమయంలో నీట్ లీకేజ్‌కు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థుల నిరసన.. అన్ని పార్టీల్నీ అప్రమత్తం చేసింది. యువతలో ఉద్యమ స్ఫూర్తి అలాగే ఉందని.. పోరాటాలకు గ్యాప్ వచ్చిందే కానీ.. పోరాటం చేసే స్వభావంలో ఎలాంటి తేడా లేదని రుజువు చేసింది. అంతేకాదు దేశంలో ఇకపై రాజకీయం ఎలా నడవాలో తామే నిర్దేశిస్తామన్న సంకేతాలు కూడా ఇచ్చింది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com



## భారతీయ సంస్కృతికి ప్రతిరూపం 'చేనేత'

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారతీయ సంస్కృతికి ప్రతిరూపం 'చేనేత' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇవాళ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలందరికీ ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'X' (ట్విట్టర్) వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న రంగం చేనేతేనని, ఇది భారతదేశంలోనే అత్యంత అతిపెద్ద కుటీర పరిశ్రమ అని ఆయన కొనియాడారు. దేశవ్యాప్తంగా సుమారు 10 కోట్ల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా చేనేత రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని బండి సంజయ్ గుర్తుచేశారు. చేనేత అనేది కేవలం వస్త్ర ఉత్పత్తి మాత్రమే కాదని, అది భారతీయ చరిత్ర, విశిష్ట సంస్కృతి, అత్యున్నత కళాత్మకతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

**ఉమ్మడి కరీంనగర్ ప్రతిభ..**

అగ్గిపెట్టెలో పట్టేంత నైపుణ్యంతో చీరను నేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఘనత ఉమ్మడి కరీంనగర్ జిల్లా చేనేత కళాకారులదేనని ఆయన ప్రశంసించారు. స్వాతంత్ర్య పోరాటానికి మూలమైన మువ్వన్నెల జెండాను సైతం నేసిన చేనేత వర్గానికి తెలంగాణ రాష్ట్రంలో సరైన ప్రోత్సాహం, చేయూత కరువైందని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 'లోకల్ ఫర్ వోకల్', 'మేక్ ఇన్ ఇండియా' పిలుపుతో మన చేనేత ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, నేతన్నలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. IIHT ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# బీభత్సం సృష్టించిన బ్రీజా కారు..



**నందిపేట,ఫ్లాష్ ఇండియా :** నందిపేట శివారులో గురువారం రాత్రి ఓ బ్రీజా కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకెళ్లిన కారు వరుసగా రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టి, అనంతరం కల్వర్టును ఢీకొనడంతో ప్రమాదానికి గురైంది. ప్రమాదం అనంతరం కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో రెండు బైక్‌లపై ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా, కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డట్లు సమాచారం.

**స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..**

నందిపేట మండల కేంద్రానికి చెందిన అక్తర్ హుస్సేన్, ఆయన భార్య అంజుమ్ సుల్తానా ఒక ద్విచక్ర వాహనంపై, మరో ద్విచక్ర వాహనంపై రహీమ్, ఆయన భార్య సమీనా గురువారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో నందిపేట నుంచి ఆర్మూర్‌కు బయలుదేరారు. విజయనగర్ కాలనీలోని రామాలయం సమీపానికి చేరుకోగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న బ్రీజా కారు రెండు బైక్‌లను ఢీకొట్టింది. దీంతో నాలుగు మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అక్తర్ ముప్కాల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు అతివేగంగా నందిపేట వైపు దూసుకెళ్లడంతో వివేకానంద చౌరస్తాలో ఉన్న కొందరు యువకులు కారును వెంబడించే ప్రయత్నం చేశారు. అయితే కారు ఆచూకీ లభించలేదు. కొద్ది సేపటికే చిమ్రాజుపల్లి శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గుత్పా కాలువ వద్ద టీజీ 16 ఏ 3970 నంబర్ గల బ్రీజా కారు మంటల్లో దగ్ధమవుతుండగా అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డట్లు సమాచారం. ఈ కారు నందిపేట మండలం సీహెచ్ కొండూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిదిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజల సమస్యలపై వెనక్కి తగ్గని మంత్రి



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** వర్షం కురుస్తున్నా ప్రజా సమస్యల పరిష్కారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఒక చేతిలో గొడుగు పట్టుకుని, మరోవైపు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డుల్లో శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్తో కలిసి సాయిగణేష్ నగర్, ఇందిరమ్మ కాలనీల్లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**టీ కొట్టులో ప్రజలతో మమేకం**

పర్యటనలో భాగంగా సాయిగణేష్ నగర్‌లోని ఓ చిన్న టీ కొట్టు వద్ద మంత్రి ఆగారు. స్థానికులతో కలిసి టీ తాగుతూ వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, విద్యుత్ తీగలు, వర్షపు నీరు నిల్వ ఉండడం తదితర సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి తమ మధ్యే కూర్చొని సమస్యలు వినడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

**ఏదులాపురం అభివృద్ధికి రూ.100 కోట్లు**

ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత డ్రైనేజీ నిర్మాణం, తాగునీటి సరఫరా మెరుగుదల, తుమ్మ చెట్ల తొలగింపు వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు.

**ప్రజా అవసరాలే ప్రభుత్వ ప్రాధాన్యం**

ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి ప్రజలు సమర్పించిన వినతులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న పార్కుల అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ యుగంధర్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# తుమ్మిడి హెట్టి బ్యారేజ్ నిర్మాణంపై సర్కార్ ఫోకస్..

**ఆసిఫాబాద్,ఫ్లాష్ ఇండియా :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రాజెక్టు నిర్మాణానికి కొత్త డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం చేసేందుకు ఆర్వీ అసోసియేట్స్ సంస్థతో ఇటీవల డ్రోన్ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ఆధారంగా తుమ్మిడిహెట్టి వద్ద రెండు భారీ బ్యారేజీల నిర్మాణాన్ని సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు సమాచారం. వార్ధా--వెయిన్‌గంగా నదుల సంగమ ప్రాంతంలో ఒక బ్యారేజీని వార్ధా నదిపై, మరొక బ్యారేజీని వెయిన్‌గంగా నదిపై నిర్మించాలని సూచించింది. వార్ధా బ్యారేజీని 60 గేట్లతో 867 మీటర్ల పొడవున, వెయిన్‌గంగా బ్యారేజీని 77 గేట్లతో 1,113.50 మీటర్ల పొడవున నిర్మించాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. వరదల సమయంలో ముంపు ప్రభావం లేకుండా నదీ ప్రవాహానికి లంబకోణంలో 150 మీటర్ల ఎత్తుతో ఈ రెండు బ్యారేజీలను నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు.


**రూ.12 వేల కోట్లతో నిర్మాణ ప్రణాళిక**

గతంలో ప్రతిపాదించిన ప్రదేశంలోనే ఇప్పుడు కొత్తగా బ్యారేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్ల వరకు కాలువల నిర్మాణం సుమారు 95 నుంచి 100 కిలోమీటర్ల మేర చేపట్టాల్సి ఉండగా, ఇప్పటికే 45 నుంచి 50 కిలోమీటర్ల మేర కాలువల తవ్వకం పూర్తయింది. మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.12 వేల కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఇందులో రూ.6 వేల కోట్లను కాలువలు, పంప్‌హౌస్‌లు, అటవీ అనుమతుల వ్యయం తదితర పనులకు వినియోగించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల నీటిని వినియోగించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో రెండు లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**ప్రాజెక్టుపై మళ్లీ ప్రభుత్వ ఫోకస్**

2008 డిసెంబర్ 16న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రాష్ట్ర విభజన, రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్ పేరుతో ఈ ప్రాజెక్టును కాళేశ్వరానికి మళ్లించింది. ఇప్పుడు దాదాపు 18 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి సందర్శించారు. అలాగే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ఇప్పటికే లేఖ రాసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాజాగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి 148 మీటర్లకు బదులుగా 150 లేదా 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీల నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రాజెక్టు త్వరగా కార్యరూపం దాల్చుతుందనే ఆశాభావంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అవినీతిపరులను వదిలిపెట్టను..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అవినీతి అధికారులకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ..చండూర్ మండలంలో ఎవరెవరు ఎంత పనిచేస్తున్నారో, ఎన్ని డబ్బులు తీసుకుంటున్నారో అన్ని వివరాల లిస్ట్ తీసుకువస్తానని అన్నారు. అందరినీ చూస్తానని, ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులు, లంచాలు తీసుకుంటున్న వారి పూర్తి వివరాలు తన వద్ద ఉన్నాయని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. తనకు పదిసార్లు ఎమ్మెల్యే అవ్వాలని లేదని, రెండు సార్లు అవకాశం వచ్చినా అది చాలని అన్నారు. ఒకప్పుడు ఎనిమిదిసార్లు ఎమ్మెల్యే, పదిసార్లు ఎమ్మెల్యే అనేవారని కానీ తనకు అంత ఓపిక లేదని చెప్పారు. ఉన్నన్ని రోజులు నిజాయితీగానే పనిచేస్తానని తెలిపారు. అధికారులతో కూడా నిజాయితీగానే పనిచేయిస్తానని చెప్పారు. రాజగోపాల్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలతో రెవెన్యూ సహా పలు శాఖల అధికారుల్లో చర్చ, ఆందోళన మొదలైంది.

# సౌకర్యాలన్నీ అస్తవ్యస్తం..!

## మోడల్ హాస్టల్‌లో విద్యార్థినుల అవస్థలు..




**బొమ్మలరామారం,ఫ్లాష్ ఇండియా :** బొమ్మలరామారం మండలంలోని మల్యాల గ్రామంలో తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణలో ఉన్న బాలికల హాస్టల్ సమస్యలకు నిలయంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 2013లో ఈ పాఠశాలను ప్రారంభించింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఇక్కడ ప్రవేశాలు పొందారు. బాలికల సౌకర్యాల కోసం పాఠశాలకు అనుబంధంగా హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. హాస్టల్ నిర్వహణ కోసం కేర్‌టేకర్, నైట్ వాచ్‌మన్, ఏఎన్ఎం, ముగ్గురు వంట సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. అయితే స్కావెంజర్, స్వీపర్ పోస్టులు కేటాయించకపోవడంతో పాటు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా హాస్టల్‌లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థినుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోందని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. 100 మంది విద్యార్థినులకు వసతి కల్పించే సామర్థ్యం ఉన్న హాస్టల్‌లో 80 మంది అడ్మిషన్ పొందగా, ప్రస్తుతం కేవలం 58 మంది మాత్రమే ఉంటున్నారు. దీనిని బట్టి అక్కడి పరిస్థితులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోందని స్థానికులు అంటున్నారు. హాస్టల్‌లోని 18 టాయిలెట్ల పరిశుభ్రత కోసం నెలకు రూ.3 వేల నిధులు కేటాయించినప్పటికీ, వాటిని శుభ్రం చేసే సిబ్బంది లేక టాయిలెట్లు అపరిశుభ్రంగా మారాయి. విద్యార్థినులకు వేడి నీరు అందించే సోలార్ వ్యవస్థ పనిచేయడం లేదు. వారి భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదు. వాషింగ్ కోసం ఏర్పాటు చేసిన నల్లాలకు ఇప్పటికీ నీటి కనెక్షన్ ఇవ్వలేదు. హాస్టల్, పాఠశాలకు ఒకే విద్యుత్ మీటర్ ఉండటంతో తరచూ విద్యుత్ కేబుల్ కాలిపోతోంది. దీంతో హాస్టల్‌లో బల్బులు కాలిపోవడంతో పాటు, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల విద్యార్థినులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**హాస్టల్ కేర్‌టేకర్ మాధవి మాట్లాడుతూ...**

"మిషన్ భగీరథ నీరు రోజు విడిచి రోజు వస్తోంది. మల్యాల గ్రామపంచాయతీ నుంచి ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పిస్తున్నాం. కరెంటు లేనప్పుడు నీటి సరఫరా కొంత ఆలస్యమవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ దూరంగా ఉండటంతో తరచూ విద్యుత్ కేబుల్ కాలిపోతోంది. ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారులతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం" అని తెలిపారు.

# పోలీసులకే షాకిస్తూ ఎదురు ప్రశ్న

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిని వేధించిన కేసులో అరెస్ట్ అయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ని పోలీసులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో రెండో రోజు కూడా విచారిస్తున్నారు. సంచలనం సృష్టించిన ఈ కేసులో కోర్టు మంజూరు చేసిన 2 రోజుల పోలీస్ కస్టడీ నేటితో ముగియనుంది. పోలీసుల కస్టడీ విచారణ సందర్భంగా ఉదయ్ కృష్ణారెడ్డి సంచలన విషయాలను బయటపెట్టినట్లుగా తెలుస్తోంది. తొలి రోజు విచారణలో బాధితురాలైన మహిళా ట్రైనీ ఐపీఎస్‌తో పరిచయం ఏర్పడిన తీరు, వేధింపులకు పాల్పడిన విధానం, పరిణామాలపై అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. బాధితురాలితో తనకు గతంలో సన్నిహిత సంబంధం ఉందని ఉదయ్ పోలీసులకు చెప్పినట్లుగా సమాచారం. బాధితురాలు మరొకరిని వివాహం చేసుకోవడాన్ని తను తట్టుకోలేకపోయానని, ఆ కోపంతోనే ఆమెను వేధించానని విచారణ అధికారుల వద్ద అంగీకరించినట్లుగా తెలిసింది.

**అధికారులకే ఎదురు ప్రశ్న..**

అయితే, రెండో రోజు విచారణలో భాగంగా నిందితుడు ఉదయ కృష్ణారెడ్డి లోతుగా ప్రశ్నించేందుక పోలీసులు ప్రయత్నించారు. ఇదే సమయంలో అతడు సహనం కోల్పోయాడని సమాచారం. 'నన్ను ఎందుకు ఇలా విసిగిస్తున్నారు?' అంటూ విచారణ అధికారులనే ఎదురు ప్రశ్నించినట్లుగా తెలుస్తోంది. నేటితో కస్టడీ గడువు ముగియనుండటంతో, విచారణ అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు తిరిగి న్యాయస్థానంలో ప్రవేశపెట్టనున్నారు.

# చేనేతను ప్రోత్సహిస్తాం..



**హుస్నాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే చేనేత రంగాన్ని ప్రోత్సహించి, నేతన్నలకు ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్‌లోని శ్రీ మార్కండేయ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కండేయ ఆలయంలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి మాట్లాడుతూ.. రాజకీయ, ప్రభుత్వ కార్యక్రమాల్లో అతిథులకు ప్లాస్టిక్, సింథటిక్ శాలువాలు కప్పే సంస్కృతికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. అందరం చేనేత వస్త్రాలనే ధరించి, నేతన్నలు తయారు చేసే ఉత్పత్తులను ప్రోత్సహిద్దామని సభలో ప్రతిజ్ఞ చేయించారు. ఇటీవల మరణించిన చేనేత కార్మికుడు అల్వాల రాములు కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయంగా రూ.5 లక్షల పరిహారం చెక్కును అందజేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని దేవాలయాల్లో పాలిథిన్ శాలువాల వినియోగాన్ని పూర్తిగా నిరోధిస్తామని తెలిపారు. హ్యాండ్‌లూమ్‌తో పాటు పవర్‌లూమ్ క్లస్టర్లను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులు, అధికారులతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. ప్రకృతి విపత్తులు, కరువుల నుంచి కాపాడుకోవాలంటే పర్యావరణ సమతుల్యత అవసరమని, ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దానిని సంరక్షించడం భవిష్యత్ తరాలకు ఇచ్చే గొప్ప వరమని అన్నారు. మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణలో హుస్నాబాద్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కళాశాలకు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే కాంపౌండ్ వాల్, ఫ్లోరింగ్ పనులు కూడా చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరమణ, కౌన్సిలర్లు, చేనేత సహకార సంఘం నాయకులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జోనల్ కమిషనర్ ను కలిసిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** బోడుప్పల్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ శుక్రవారం జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఈఈ రమేష్ బాబులను కలిసి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులకు ప్రాధాన్యతనిచ్చి త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో డివిజన్ అధ్యక్షులు బి. కళ్యాణ్, కర్రె రాజేష్, తుంగతుర్తి రవి, నాగారం కాంగ్రెస్ నాయకులు జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీపురంలో ట్రాఫిక్‌కు చెక్..




**బూర్గంపాడు,ఫ్లాష్ ఇండియా :** బూర్గంపాడు మండలం, లక్ష్మీపురం గ్రామంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి, ప్రమాదాలను నివారించడానికి బూర్గంపాడు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా మొత్తం 10 "నో పార్కింగ్" బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐలు మేడ ప్రసాద్, నాగభిక్షంలు గ్రామస్తులకు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. రహదారులపై వాహనాలను పార్కింగ్ చేయవద్దని కోరారు. రహదారిపై వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్ఐ ప్రసాద్ అన్నారు. ఈ 'నో పార్కింగ్' బోర్డులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడానికి ప్రజలను ప్రోత్సహిస్తాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా, ప్రజలు తమ సొంత భద్రతను, ఇతరుల భద్రతను నిర్ధారించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా లక్ష్మీపురంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు.

# ఇప్పుడైనా ఆ రైతులకు న్యాయం జరిగేనా...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం లోని దామరచర్ల మండల పరిధిలో ఏర్పాటుచేసిన వీర్లపాలెం యాదాద్రి పవర్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో కోల్పోయిన భూమి కోసం రైతులు పడిన అవస్థలు అన్నీ ఇన్ని కావు. గతంలో నల్గొండ కలెక్టర్ ఆఫీస్ దగ్గర 12 రోజులు పోరాటం చేసిన న్యాయం జరగలేదు. దీంతో సహనం కోల్పోయిన రైతులు గౌరవ షెడ్యూల్ క్యాస్ట్ నేసషనల్ కమీషన్ ని కలిసి కోల్పోయిన 2.20 కుంటల భూమికీ న్యాయం చేయాలనీ కోరడం జరిగింది. ఇట్టి విషయంపై 12.2.2026 రోజున నల్గొండ కలెక్టర్ కి నోటీసు ఈయడం జరిగింది. ఇట్టి విషయాశీ గురించి జాయింట్ సర్వే చేయమని ఎస్సీ కమిషన్ సంబంధిత ఎమ్మార్వో,మిర్యాలగూడ ఆర్డీవో లు కలిసి జాయింట్ సర్వే చేయమని కోరడం జరిగింది. జాయింట్ సర్వే లో భాగంగా ది 07.08.2026 శుక్రవారం జాయింట్ సర్వే చేయడం జరిగింది. ఇకనైనా ఆ రైతులకు న్యాయం జరుగుతుందని భావంతో ఉన్నారు. సర్వే చేసిన వారిలో మిర్యాలగూడ డివిజన్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ హిమ బిందు. మిర్యాలగూడ డివిజన్ ఇన్స్పెక్టర్ సర్వేయర్ రామకృష్ణ రెడ్డి,మిర్యాలగూడ డివిజన్ ఫారెస్ట్ రెంజర్,దామరచర్ల మండలం తహసిల్దార్ జవహార్ లాల్ లు కలిసి ఈ జాయింట్ సర్వే చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు మంద ఇద్దయ్య,మందలింగయ్య,నాగేంద్రబాబు,యేసయ్య,మంద కోటమ్మ,మంద భూలక్ష్మి లు ఉన్నారు.

# ఆగష్టు 10న 'చలో ఇందిరా పార్క్'



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దళిత క్రైస్తవుల రాజ్యాంగ హక్కులను హరించిన 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వు (షెడ్యూల్డ్ కులాలు) 3వ పేరా అమలులోకి వచ్చిన రోజును పురస్కరించుకొని ఆగష్టు 10న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద దళిత క్రైస్తవుల మహా నిరసన సభ నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసిఎఫ్) నల్లగొండ జిల్లా నాయకులు తెలిపారు. ఈ మహా నిరసన సభ ఆగష్టు 10 వ తేదిన హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరుగుతుందని,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ విచ్చేయనున్నారని,దళిత క్రైస్తవులకు జరిగిన చారిత్రక అన్యాయానికి వ్యతిరేకంగా,ఎస్.సి హోదా సాధన కోసం ఈ సభను నిర్వహిస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాలకు చెందిన దళిత క్రిస్టియన్లు స్వచ్ఛందంగా,పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ మహా నిరసన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు ఎం.ఆనందమయ, జె. ఆశీర్వాదం.ఎం.ఏసురత్నం, కత్తుల యెహోవా దాస్, చింత సైదులు పాల్, వేముల ఆనంద్, సిహెచ్.జాషువా తదితరులు పాల్గొన్నారు

# క్రమశిక్షణతో,అంకితభావంతో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మరియు స్థానిక కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసి,వారి విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్యేనని,ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో, అంకితభావంతో చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధర్మా నాయక్,కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# విజిలెన్స్ తనిఖీల్లో అక్రమాలు గుర్తించింది ఎంత...?

**లోకేశ్వరం,ఫ్లాష్ ఇండియా :** లోకేశ్వరం మండలంలో గురువారం పలు రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. కాగా రెండు రోజులు గడిచినా ఎంత మేరకు అక్రమాలు జరిగాయో అధికారులు వెల్లడించడం లేదు. కాగా ఒక రైస్ మిల్లు యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విజిలెన్స్ అధికారులు సాత్ గాం ప్రాంతంలోని రెండు రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. కాగా ఒక్క రైస్ మిల్లులో పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించి సంబంధిత రైస్ మిల్లు యజమానిని శుక్రవారం లోకేశ్వరం పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై లోకేశ్వరం ఎస్ ఐ ని ఫోన్లో సంప్రదించగా ఆయన స్పందించలేదు. అలాగే ముథోల్ సిఐని ఫోన్ లో సంప్రదించగా త్వరలో వివరాలు వెల్లడిస్తామని సమాధానాన్ని దాటవేశారు. దీనితో అక్రమాల గుట్టు విప్పే అధికారులు ఎందుకు దాచిపెడుతున్నారో అర్థం కావడం లేదు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణ ఎఫ్సీఐ నందు ఉన్న శ్రీ చైతన్య పాఠశాలల్లో ఘనంగా బోనాల పండుగ వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ సాంప్రదాయ పండగగా వెలువడే బోనాల పండగను మా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు చక్కని అలంకరణ వేషధారణతో అలరిస్తూ తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాల పండుగను ప్రతిబింబించే సాంప్రదాయ వేషధారణలో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారి బోనాలు, పోతురాజు,తెలంగాణ జానపద కళారూపాలు మరియు సంప్రదాయ వస్త్రధారణతో చిన్నారులు అందరినీ అలరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు,భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. పిల్లల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల నిర్వహించిన ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలోకరెస్పాండంట్ పి.శ్రీనివాస్ రెడ్డి,డైరెక్టర్ కె.ఉమా,ప్రిన్సిపాల్ పి.రవికుమార్,టీచర్స్ వెంకట్ రెడ్డి,కావ్య,అంజలి,ఝాన్సీ,అరుణ,రిజ్వానా,సాలెహా,నస్రీన్,రాధా,శ్రీదేవి,భారతి,సుజాత,తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు శిశువు ఎదుగుదలకు దోహదం...




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు పిడి పి. వేణుగోపాల్ రావు ఆదేశానుసారం ప్రపంచ తల్లిపాల దినోత్సవం శుక్రవారం మిర్యాలగూడ మండల పరిధిలోని అన్నారం సెక్టార్ లోని జంకుతండ గ్రామపంచాయతీ పరిధిలోని మాలోతు తండా అంగన్వాడి కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ అర్బన్ అంగన్వాడి సూపర్వైజర్ సంధ్య మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ఎదుగుదలకు దోహదపడుతుందని మిర్యాలగూడ అర్బన్ సూపర్వైజర్ సంధ్య అన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అందించి శిశువు ఎదుగుదలకు రోగ నిరోధక శక్తి దోహదపడేలా తల్లి చర్యలు తీసుకోవాలని కోరారు. శిశు పుట్టిన దగ్గర నుండి ఆరు నెలల వరకు తల్లిపాలు అందిస్తే శిశువు ఎదుగుదల బాగుంటుందని సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు లక్ష్మీ,,మహిళలు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న వారి కోసం రక్తదానం చేయండి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జన్మదినోత్సవ వేడుకలను ఆర్భాటాలకు దూరంగా నిర్వహిస్తూ,ఆపదలో ఉన్న వారికి తన వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నల్లగొండమున్సిపల్ కార్పొరేషన్ తొలి డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ తెలిపారు. శుక్రవారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 100 మంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, ఆయా వార్డుల ప్రజలు రక్తదాన శిబిరం వద్దకు చేరుకుని అసఫ్ అలీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి,శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ మాట్లాడుతూ జన్మదినోత్సవం సందర్భంగా చేసే ఆర్భాటాల కంటే ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడేందుకు సహకరించడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు,నాయకులు, యువకులు,అభిమానులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**భద్రాచలం,ఫ్లాష్ ఇండియా :** భద్రాచలం గోదావరి వంతెన కింద వైకుంఠధామం వద్ద శుక్రవారం ఓ గుర్తు తెలియని మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. మృతుడి వయస్సు 50-60 ఏళ్లు ఉంటుంది. ఎరుపు రంగు ఛాయ, తెల్ల జుట్టు, బట్టతల కలిగి ఉన్న సదరు వ్యక్తి సిమెంట్ కలర్ షర్ట్, గ్రీన్ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతుని వివరాలు తెలిస్తే భద్రాచలం టౌన్ పోలీసులను సంప్రదించవలసినదిగా కోరారు.

# ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో హత్య కేసు నిందితుడి అరెస్ట్



**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో ఈ నెల 2 వ తేదీన జరిగిన హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడిని కాచిగూడ రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. నేపాల్‌కు చెందిన రాజ్‌కుమార్ శర్మ అలియాస్ యువరాజ్ శర్మ (47)ను సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ పరిసరాల్లో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 2న నిందితుడు తన స్నేహితుడు గణేష్‌తో కలిసి హుప్పుగూడలో మద్యం సేవించాడు. అనంతరం రైల్వే స్టేషన్ వైపు వెళ్తుండగా గణేష్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అదే సమయంలో ఓ వ్యక్తి నిందితుడి బ్యాగ్ తీసుకెళ్లినట్లు గుర్తించిన రాజ్‌కుమార్ అతడితో గొడవకు దిగాడు. ఘర్షణలో గ్రానైట్ రాయితో తలపై, సిమెంట్ ఇటుకతో ముఖంపై దాడి చేయడంతో బాధితుడు తీవ్రంగా గాయపడి ప్లాట్‌ఫామ్‌పై పడిపోయాడు. ఈ ఘటన అనంతరం నిందితుడు పరారయ్యాడు. అతడి కోసం గాలింపు చేపట్టిన కాచిగూడ జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది గురువారం సాయంత్రం సుమారు 4.30 గంటలకు సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ పరిసరాల్లో గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడు గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో వివిధ ప్రాంతాల్లో కూలీగా, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మద్యం, గంజాయి సేవించే అలవాటు ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌ను రైల్వే పోలీసు అధికారులు, కాచిగూడ జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో నిర్వహించారు.



# రిటైర్ అయినా తగ్గని బ్రాండ్ విలువ..

క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి ఎన్నో ఏళ్లు అవుతున్నా.. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ బ్రాండ్ విలువ మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. క్రీడా ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సచిన్.. ఇప్పటికీ దేశంలోని అత్యంత ప్రభావవంతమైన సెలబ్రిటీ బ్రాండ్లలో ఒకరిగా కొనసాగుతున్నారు. క్రోల్ ఇండియా సెలబ్రిటీ బ్రాండ్ వాల్యూ 2025 నివేదిక ప్రకారం.. సచిన్ బ్రాండ్ విలువ 125.9 మిలియన్ డాలర్లు. అంటే భారత కరెన్సీలో సుమారు రూ.1,189 కోట్లు. ఈ బ్రాండ్ విలువతో దేశంలోని టాప్-5 సెలబ్రిటీ బ్రాండ్లలో స్థానం సంపాదించారు.అంతేకాదు భారత టాప్-10 సెలబ్రిటీ బ్రాండ్ల జాబితాలో చోటు దక్కించుకుంటున్న ఏకైక మాజీ క్రికెటర్ కూడా సచిన్ టెండూల్కరే. ఏటా ఆయన బ్రాండ్ విలువ పెరుగుతుండటానికి ప్రజల్లో ఉన్న విశ్వాసం, గౌరవం, నమ్మకం ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. దీంతో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ బ్రాండ్లకు సచిన్ ఇప్పటికీ ఆకర్షణీయమైన ప్రచారకర్తగా కొనసాగుతున్నారు. క్రికెట్‌లో సచిన్ సాధించిన రికార్డులు ఆయన బ్రాండ్ విలువకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. ఆ కాలంలో టాప్ బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందిన సచిన్.. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచారు. టెస్టులు, వన్డేల్లో కలిపి అత్యధిక సెంచరీలు చేసిన రికార్డు కూడా ఆయన పేరిటే ఉంది.అంతర్జాతీయ క్రికెట్‌లో సచిన్ మొత్తం 34,357 పరుగులు చేశారు. క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డుల్లో నిలిచారు. రెండు దశాబ్దాలకు పైగా సాగిన తన కెరీర్‌లో సచిన్ ఎన్నో రికార్డులను నెలకొల్పారు. వాటిలో కొన్ని రికార్డులు ఇప్పటికీ ప్రత్యేకంగానే నిలిచాయి. సచిన్ 200 టెస్టు మ్యాచ్‌లు ఆడారు. టెస్టు ఫార్మాట్‌లో 200 మ్యాచ్‌లు ఆడిన ఆటగాడు మరొకరు లేరు. టెస్టుల్లో సచిన్ 15,921 పరుగులు చేయగా.. అందులో 51 సెంచరీలు ఉన్నాయి. 15,000 టెస్టు పరుగుల మైలురాయిని కేవలం 300 ఇన్నింగ్స్‌ల్లోనే సచిన్ అందుకున్నారు.వన్డే క్రికెట్‌లోనూ సచిన్ రికార్డులు అసాధారణమైనవే. 22 సంవత్సరాల 91 రోజుల పాటు సాగిన ఆయన వన్డే కెరీర్.. ఈ ఫార్మాట్‌లో సుదీర్ఘమైన కెరీర్లలో ఒకటిగా నిలిచింది. 1998లో కేవలం ఒకే క్యాలెండర్ సంవత్సరంలో 1,894 పరుగులు, తొమ్మిది సెంచరీలు చేసిన రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. వన్డేల్లో సచిన్ 145 అర్ధ సెంచరీలు సాధించడంతో పాటు 2,016 ఫోర్లు బాదారు. వన్డేల్లో 18,000 పరుగుల మైలురాయిని కేవలం 440 ఇన్నింగ్స్‌ల్లోనే చేరుకున్నారు. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత కూడా సచిన్‌పై అభిమానుల్లో ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. మైదానంలో సాధించిన రికార్డులతో పాటు.. వ్యక్తిగత ప్రతిష్ఠ, విశ్వసనీయత, ప్రజల్లో ఉన్న అపారమైన గౌరవం ఆయనను ఇప్పటికీ అత్యంత విలువైన సెలబ్రిటీ బ్రాండ్లలో ఒకరిగా నిలబెడుతున్నాయి.

# టైటిల్ కైవసం చేసుకున్న ప్రజ్ఞానంద!





భారత యంగ్ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద మరోసారి చరిత్ర సృష్టించాడు. అమెరికాలో జరిగిన ప్రతిష్టాత్మక 'గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్' టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచారు. పెనాల్టిమేట్ రౌండ్‌లో జవోఖిర్ సిందరోవ్‌తో జరిగిన గేమ్‌ను డ్రా చేసుకుని, టోర్నీ ముగియడానికి మరో రౌండ్ మిగిలి ఉండగానే ప్రజ్ఞానంద టైటిల్‌ను ఖరారు చేసుకున్నారు. ఈ టోర్నీలో ఆయన మొత్తం 35 పాయింట్లకు గాను 23 పాయింట్లు సాధించి, తన సమీప ప్రత్యర్థుల కంటే 1.5 పాయింట్ల ఆధిక్యంతో అగ్ర స్థానంలో నిలిచారు. ప్రజ్ఞానంద కెరీర్‌లో సాధించిన తొలి ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీ టైటిల్ ఇది కావడం విశేషం.ఇటీవల జూన్ నెలలో ఓస్లోలో జరిగిన 'నార్వే చెస్ 2026' టోర్నమెంట్‌లో వరుసగా నాలుగు విజయాలతో సంచలనం సృష్టించి ఛాంపియన్‌గా నిలిచిన ప్రజ్ఞానంద, ఇప్పుడు ఈ విజయంతో తన ఫామ్‌ను మరోసారి నిరూపించుకున్నారు. ఈ క్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఆయనను అభినందించడమే కాకుండా రూ. 50 లక్షల నగదు బహుమతిని అందజేశారు. కొద్ది రోజుల వ్యవధిలోనే అంతర్జాతీయ వేదికపై రెండు ప్రతిష్టాత్మక చెస్ టైటిళ్లను గెలుచుకుని భారతదేశ కీర్తిని సమున్నతంగా నిలబెట్టిన ప్రజ్ఞానందను క్రీడా ప్రపంచం, నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

# 25 ఏళ్లకే రిటైర్మెంట్




ఇంగ్లాండ్ బౌలర్ జాన్ టర్నర్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఎంతో క్రికెట్ కెరీర్ ఉన్న ఈ యువ బౌలర్ 25 ఏళ్ల వయసులోనే రిటైర్మెంట్ ప్రకటించాడు. గురువారం తన నిర్ణయాన్ని వెల్లడించాడు. గాయాల కారణంగానే తాను నిర్ణయం తీసుకున్నట్టు తెలిపాడు. 'ప్రొఫెషనల్, అంతర్జాతీయ క్రికెట్ ఆడటం నా చిరకాల కల. హాంప్‌షైర్, ఇంగ్లాండ్‌కు ఆడటం ద్వారా నా చిన్ననాటి కలను నిజం చేసుకున్నాను. అయితే ఆట నుంచి రిటైర్ అవ్వాలని నిర్ణయించుకున్నా. ఇది నేను తీసుకున్న అత్యంత కష్టమైన నిర్ణయం. పాదం గాయం ఏడాదిపాటు నన్ను ఆటకు దూరం చేసింది. తరుచుగా గాయపడటం వల్ల ఓ క్రికెటర్‌గా ఆటకు దూరంగా నా భవిష్యత్తు గురించి ఆలోచించేలా చేసింది. అందుకే నా తదుపరి సవాల్‌ను స్వీకరించడానికి ఇదే సరైన సమయం అని భావిస్తున్నా'అని టర్నర్ తెలిపాడు. 2021లో హాంప్‌షైర్ జట్టులో చేరిన అతను 'ది హండ్రెడ్' టోర్నీలో ఆకట్టుకున్నాడు. దీంతో 2023లో అతను తొలిసారిగా జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్ తరపున రెండు వన్డేలు, రెండు టీ20లు ఆడి మూడు వికెట్లు తీశాడు. దేశవాళీలో అద్భుతమైన రికార్డు కలిగిన టర్నర్ తన కెరీర్‌కు ఊహించని రీతిలో ముగింపు పలికాడు.

# సూపర్‌మ్యాన్ ఫీల్డింగ్..



ఇంగ్లండ్‌లో జరుగుతున్న 'ది హండ్రెడ్ 2026' టోర్నీలో గురువారం (ఆగస్టు 6) నాడు లండన్ స్పిరిట్, ఎంఐ లండన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ అభిమానులకు ఉత్కంఠభరితమైన అనుభూతిని అందించింది. లండన్ లోని చారిత్రాత్మక లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో ఎంఐ లండన్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అయితే మ్యాచ్ ఫలితానికి మించి అందరి దృష్టిని ఆకర్షించింది స్టార్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ అందుకున్న స్టన్నింగ్ క్యాచ్.లండన్ స్పిరిట్ బ్యాటర్ లువాన్ డ్రే ప్రిటోరియస్ భారీ షాట్ కొత్తగా.. బంతి సిక్స్‌కు వెళ్లేలా కనిపించింది. అయితే బౌండరీ లైన్ వద్ద ఉన్న విల్ జాక్స్ ముందుగా బంతిని బౌండరీ దాటకుండా అడ్డుకున్నాడు. ఆ తర్వాత మైదానంలోకి తిరిగి వచ్చి ఫుల్ లెంగ్త్ డైవ్ చేస్తూ ఒకే చేతితో అద్భుత క్యాచ్ పట్టాడు. ఈ క్యాచ్ చూసి బ్యాటర్‌తో పాటు స్టేడియంలోని ప్రేక్షకులు కూడా ఆశ్చర్యపోయారు. ఈ క్యాచ్ తో మ్యాచ్ మలుపు తిప్పింది.ఈ లండన్ డెర్బీ మ్యాచ్‌ను వీక్షించేందుకు 27,721 మంది ప్రేక్షకులు లార్డ్స్‌కు హాజరయ్యారు. ది హండ్రెడ్ గ్రూప్ దశలో ఇది రికార్డు స్థాయి ప్రేక్షకుల హాజరు. జేమీ ఓవర్టన్, జేమ్స్ కోల్స్ చివరి ఓవర్లలో వేగంగా పరుగులు చేయడంతో లండన్ స్పిరిట్ నిర్ణీత 100 బంతుల్లో 5 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. ఇక 161 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎంఐ లండన్‌కు విల్ జాక్స్ ఓపెనర్‌గా వచ్చి 18 పరుగులు మాత్రమే చేశాడు. అయితే బ్యాటింగ్ కంటే అతని అద్భుత క్యాచ్‌నే అభిమానులు ఎక్కువగా గుర్తుంచుకున్నారు. చివర్లో సికందర్ రజా కేవలం 16 బంతుల్లో 32 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఇంకా 6 బంతులు మిగిలి ఉండగానే ఎంఐ లండన్ లక్ష్యాన్ని ఛేదించి 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.


## ఆ జట్టు కెప్టెన్ గా ఛాన్స్ !




ఐపీఎల్ 2027 ప్రారంభం కాకముందే ఫ్రాంచైజీల మధ్య ట్రేడింగ్ హడావిడి మొదలైంది. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ ను వీడతాడన్న వార్త బయటకు రాగానే... బెల్లం చుట్టూ ఈగలు వాలినట్టుగానే.. అతని కోసం మిగతా జట్లు ఎగబడుతున్నాయి. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో హార్దిక్ పాండ్యాకు డీల్ కుదిరిందని నిన్నటి వరకు జోరుగా ప్రచారం సాగింది. ఇంతలోనే పాండ్యా గురించి మరో న్యూస్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అజింక్య రహానే తప్పుకున్న నేపథ్యంలో కేకేఆర్ జట్టుకు కొత్త కెప్టెన్ అవసరం అర్జెంటుగా ఉంది.ఈ క్రమంలో హార్దిక్ పాండ్యాతో కేకేఆర్ జట్టు యాజమాన్యం చర్చలు జరుపుతున్నట్లు క్రీడా వర్గాలు చెబుతున్నాయి. తమ జట్టులోకి వస్తే కెప్టెన్సీ బాధ్యతలను అప్పగిస్తామని షారుఖ్ కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం అందుతోంది. హార్దిక్ పాండ్యా కేకేఆర్ లోకి వస్తే... ట్రేడ్ ప్రక్రియ ద్వారా కార్తీక్ త్యాగి, అంగ్క్రిష్ రఘువంశీని ముంబై ఇండియన్స్ లోకి పంపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ దిశగా ముంబై ఇండియన్స్, కేకేఆర్ మధ్య చర్చలు కూడా జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ ట్రేడ్ ఫైనల్ అయితే అధికారిక ప్రకటన కూడా రాబోతుందని జాతీయ మీడియాలో కూడా కథనాలు వస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# బిజినెస్

## 'మెటా'కు దెబ్బమీద దెబ్బ..




సోషల్ మీడియా దిగ్గజం మెటా కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతుతున్నాయి. తాజాగా సోషల్ మీడియా వేదికలపై పిల్లలు, టీనేజర్ల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించడంతో పాటు వారి భద్రతను నిర్లక్ష్యం చేసినందుకుగానూ మెటాకు 567 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.4,700 కోట్లకు పైగా భారీ జరిమానా విధిస్తూ న్యూ మెక్సికో కోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది.

**రెండు దశల సుదీర్ఘ విచారణ..**

న్యూ మెక్సికో అటార్నీ జనరల్ రౌల్ టోరెజ్ దాఖలు చేసిన ఈ కేసు విచారణ రెండు దశల్లో సాగింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లు పిల్లల మానసిక ఆరోగ్యానికి కలిగించే ప్రమాదాలను దాచిపెట్టి, వినియోగదారులను మోసం చేశాయని నిర్ధారిస్తూ మార్చి నెలలోనే జ్యూరీ మెటాపై 375 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.3,100 కోట్ల జరిమానా విధించింది. తాజాగా న్యాయమూర్తి బ్రయాన్ బీడ్‌షీడ్ ఇచ్చిన ఉత్తర్వులతో అదనంగా మరో 567 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశించడంతో, ఈ ఒక్క కేసులోనే మెటా చెల్లించాల్సిన మొత్తం జరిమానా 942 మిలియన్ డాలర్లకు అంటే మన కరెన్సీలో రూ.7,800 కోట్లు చేరింది. కోర్టు ఆదేశాల ప్రకారం, ఆ జరిమానా సొమ్ములో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా అడిక్షన్, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న యువత చికిత్స నిమిత్తం ఉపయోగించనున్నారు.

**పైకోర్టుకు వెళ్తాం.. 'మెటా'**

అయితే, మెక్సికో కోర్టు తీర్పుపై 'మెటా' ప్రతినిధులు స్పించారు. తమ ప్లాట్‌ఫారమ్‌లలో టీనేజర్ల భద్రతకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, నిబంధనలను నిరంతరం

మెరుగుపరుస్తున్నామని తెలిపారు. అయితే, కోర్టు ఇచ్చిన సదురు ఉత్తర్వులపై పైకోర్టులో అప్పీలు చేస్తామని వారు స్పష్టం చేశారు.

# చైనాకు ఒక్క అడుగు దూరంలో భారత్..




ఆసియాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. దీనికి తాజా ఉదాహరణగా ఫోర్బ్స్ ఆసియా విడుదల చేసిన ప్రతిష్టాత్మక 'బెస్ట్ అండర్ ఎ బిలియన్ 2026' జాబితా నిలిచింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని అత్యుత్తమ చిన్న, మధ్య తరహా పబ్లిక్ లిస్టెడ్ కంపెనీల్లో ఎంపికైన 200 సంస్థల జాబితాలో ఏకంగా 27 భారతీయ కంపెనీలు చోటు దక్కించుకున్నాయి. 28 కంపెనీలతో చైనా మొదటి స్థానంలో నిలవగా, కేవలం ఒక కంపెనీ తేడాతో భారత్ రెండో స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం.ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సప్లై చైన్ సమస్యలు, ఇంధన మార్కెట్లలో అస్థిరత వంటి అనేక సవాళ్లు కొనసాగుతున్నప్పటికీ భారతీయ కంపెనీలు బలమైన ఆర్థిక పనితీరు, నిలకడైన ఆదాయ వృద్ధి, మెరుగైన లాభదాయకతతో అంతర్జాతీయంగా తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. ఈ కారణంగానే ఫోర్బ్స్ ఎంపిక చేసిన అత్యుత్తమ సంస్థల్లో భారత కంపెనీల సంఖ్య గణనీయంగా పెరిగింది.ఈ ఏడాది జాబితాలో మరో ముఖ్యమైన అంశం కృత్రిమ మేధస్సు , సాఫ్ట్‌వేర్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్ భాగాల తయారీ రంగాల ఆధిపత్యం. ఎంపికైన మొత్తం కంపెనీలలో దాదాపు 25 శాతం సంస్థలు ఈ రంగాలకు చెందినవే. అదనంగా డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు (, పునరుత్పాదక ఇంధనం, పారిశ్రామిక సాంకేతికత, అధునాతన తయారీ రంగాల్లో పనిచేస్తున్న సంస్థలు కూడా విశేష ప్రదర్శన కనబరిచాయి. భవిష్యత్ సాంకేతికతలపై పెట్టుబడులు వేగంగా పెరుగుతున్నాయనే సంకేతాలను ఈ జాబితా స్పష్టంగా తెలియజేస్తోంది.

**కేవలం ర్యాంకింగ్ మాత్రమే కాదు..**

27 కంపెనీలతో భారత్ రెండో స్థానంలో నిలవడం కేవలం ఒక ర్యాంకింగ్ మాత్రమే కాదు. భారతీయ స్మాల్, మిడ్ క్యాప్ కంపెనీలు దేశీయ మార్కెట్‌కే పరిమితం కాకుండా ప్రపంచ స్థాయిలో పోటీ పడే సామర్థ్యాన్ని సంపాదించాయని ఇది సూచిస్తోంది. డిజిటల్ పరివర్తన, ఇంజనీరింగ్, తయారీ, ఆరోగ్య సంరక్షణ, ప్రత్యేక రసాయనాలు, అధిక విలువ కలిగిన పారిశ్రామిక రంగాల్లో భారత కంపెనీలు వేగంగా ఎదుగుతున్నాయని ఈ ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఇదే ధోరణి కొనసాగితే రాబోయే సంవత్సరాల్లో భారత్ అగ్రస్థానానికి చేరే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**చైనా ఫస్ట్.. భారత్ సెకండ్..**

దేశాల వారీగా చూస్తే చైనా 28 కంపెనీలతో మొదటి స్థానం, భారత్ 27 కంపెనీలతో రెండో స్థానం సాధించాయి. మలేషియా 19 కంపెనీలతో మూడో స్థానంలో నిలిచి ఆకట్టుకుంది. ఫోర్బ్స్ ప్రకారం, ఆ దేశంలో ఏఐ మౌలిక సదుపాయాల విస్తరణ ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. అలాగే ఈ ఏడాది జాబితాలోని 200 కంపెనీలలో 60 సంస్థలు వరుసగా రెండో ఏడాది కూడా తమ స్థానాలను నిలబెట్టుకోవడం, వాటి స్థిరమైన వ్యాపార నమూనాలు, బలమైన ఆర్థిక నిర్వహణకు నిదర్శనంగా పేర్కొంది.

**19 వేలకుపైగా లిస్టెడ్ కంపెనీల పరిశీలన..**

ఈ జాబితా ఎంపిక కోసం ఫోర్బ్స్ ఆసియా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని 19 వేలకుపైగా లిస్టెడ్ కంపెనీలను పరిశీలించింది. వార్షిక అమ్మకాలు 10 మిలియన్ డాలర్ల నుంచి 1 బిలియన్ డాలర్ల మధ్య ఉన్న సంస్థలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. కంపెనీల రుణభారం, ఒకటి మరియు మూడు సంవత్సరాల అమ్మకాల వృద్ధి, ఒక్కో షేరుపై ఆదాయం , ఈక్విటీపై రాబడి , లాభదాయకత, ఆర్థిక బలం, దీర్ఘకాలిక పనితీరు వంటి పలు ప్రమాణాల ఆధారంగా మూల్యాంకనం జరిగింది. ఈ విశ్లేషణ 2026 జూలై 10 వరకు అందుబాటులో ఉన్న ఆర్థిక సమాచారం ఆధారంగా నిర్వహించినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది.మొత్తంగా చూస్తే, ఈ ఫోర్బ్స్ జాబితా భారత కంపెనీల పెరుగుతున్న సామర్థ్యానికి, ప్రపంచ స్థాయిలో పెరుగుతున్న గుర్తింపుకు మరో నిదర్శనంగా నిలిచింది. కేవలం ఒక కంపెనీ తేడాతో చైనా తర్వాత రెండో స్థానంలో నిలవడం, ఆసియా కొత్త వృద్ధి కథలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది.

# ఏఐ రేసులో మైక్రోసాఫ్ట్ దూకుడు




భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న ఏఐ, క్లౌడ్ మార్కెట్‌పై మైక్రోసాఫ్ట్ మరింత దూకుడు పెంచింది. కంపెనీ గురువారం హైదరాబాద్‌లో దేశంలోనే తన అతిపెద్ద డేటా సెంటర్‌ను ప్రారంభించింది. 'ఇండియా సౌత్ సెంట్రల్' పేరుతో ప్రారంభమైన ఈ సెంటర్‌తో భారత్‌లో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్‌ల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే పూణే, చెన్నై, ముంబైలో డేటా సెంటర్లను నిర్వహిస్తున్న మైక్రోసాఫ్ట్, ఈ విస్తరణతో దేశంలో అతిపెద్ద క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్‌గా తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. అదానీ గ్రూప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ కొత్త సదుపాయాన్ని వినియోగించే తొలి సంస్థలుగా నిలిచాయి. భారత్‌లో ఏఐ, క్లౌడ్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కంపెనీ ఇప్పటికే సుమారు 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ప్రకటించిన సంగతి తెలిసిందే. మైక్రోసాఫ్ట్ క్లౌడ్ బిజినెస్ అజూర్ భారత్‌లో గత రెండేళ్లుగా రెండంకెల ఆదాయ వృద్ధిని నమోదు చేస్తోందని కంపెనీ వెల్లడించింది. ముఖేష్ అంబానీకి చెందిన జియోతో కలిసి మరో రెండు డేటా సెంటర్లను కూడా నిర్వహిస్తున్నాం. ఏఐ సేవలు వేగంగా, భద్రంగా అందాలంటే డేటా వినియోగదారులకు దగ్గరగా ఉండే మౌలిక సదుపాయాలు అత్యంత కీలకమని మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ పేర్కొన్నారు.



## రాశీ ఖన్నా కీలక వ్యాఖ్యలు

ఈ చిత్రంలో తన పాత్ర కథకు భావోద్వేగపరంగా కేంద్రంగా ఉంటుందని ఆమె తెలిపారు. రజినీకాంత్ పోషిస్తున్న ధర్మన్ పాత్రను ఒక మంచి వ్యక్తిగా తీర్చిదిద్దడంలో తన పాత్ర ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని స్పష్టం చేశారు. దర్శకుడు అశ్వత్ తనకు ఈ కథ చెప్పినప్పుడు వెంటనే బాగా నచ్చేసిందని, కథలో ఎంతో హృదయపూర్వకమైన ఎమోషన్ ఉందని రాశీ ఖన్నా చెప్పారు. దానికితోడు రజినీకాంత్ వంటి లెజెండరీ నటుడితో కలసి స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం రావడంతో తాను ఎంతో సంతోషంగా ఒకే చెప్పినట్లు పేర్కొన్నారు. రజినీకాంత్ సెట్స్‌లో చూపించే వినయం, కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని రాశీ ఖన్నా తెలిపారు. నటులు ఒక రకంగా ఖైదీల లాంటి వారని రజినీ సర్ చెప్పిన ఒక మాట తన మనసులో బాగా నాటుకుపోయిందని ఆమె అన్నారు. కీర్తి, ప్రఖ్యాతలను సాధించే క్రమంలో నటులు తమ జీవితంలోని కొంత స్వేచ్ఛను కోల్పోవలసి వస్తుందనే విషయాన్ని ఆయన మాటల ద్వారా తెలుసుకున్నానని వివరించారు. షూటింగ్ సమయంలో తమ ఇద్దరి మధ్య ఆధ్యాత్మికత, అంతర్గత ఎదుగుదల, ప్రశాంతత ,ఆత్మజ్ఞానం గురించిన అనేక సంభాషణలు జరిగాయని చెప్పుకొచ్చారు.



## కానీ ఊహించని పరిస్థితి ఎదురైంది


అలనాటి స్టార్ హీరోయిన్లలో ఒకరైన మీనా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో అగ్ర కథానాయికగా ఎన్నో సంవత్సరాలు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అనేక మంది స్టార్ హీరోల సరసన నటించి తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం సినిమాల సంఖ్య తగ్గించిన మీనా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. మీనా మాట్లాడుతూ... కెరీర్ ప్రారంభంలో నాతో పోలిస్తే గ్లామర్ పాత్రలు చేసిన హీరోయిన్లకు ఎక్కువ ఆదరణ, గుర్తింపు లభించేది. అది చూసి నేనూ అలాంటి పాత్రలు చేయాలనే ఆసక్తి చూపాను. అదే సమయంలో ప్రభుదేవా హీరోగా తెరకెక్కిన ఓ సినిమాలో అవకాశం వచ్చింది. ఆ చిత్రంలో స్విమ్‌సూట్ ధరించి నటించాల్సి వచ్చింది. షూటింగ్‌కు సిద్ధమై స్విమ్‌సూట్ వేసుకున్న తర్వాత అద్దంలో నన్ను నేను చూసుకుని అసౌకర్యంగా ఫీల్ అయ్యాను. డ్రెస్సింగ్ రూమ్ నుంచి బయటకు రావడానికే చాలా సిగ్గేసింది. ఆ దుస్తుల్లో డ్యాన్స్ చేయడం, నటించడం కూడా చాలా ఇబ్బందిగా అనిపించిందని తెలిపారు. గ్లామర్ పాత్రలు చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ, ఆ అనుభవం తనను తీవ్ర అసౌకర్యానికి గురి చేసిందని మీనా వెల్లడించారు. కెరీర్ తొలినాళ్లలో జరిగిన ఆ సంఘటన ఇప్పటికీ తనకు గుర్తుండిపోయిందని ఆమె చెప్పుకొచ్చారు.




## సెన్సార్ పూర్తి చేసుకున్న 'మగుడం'

తమిళ స్టార్ నటుడు విశాల్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మగుడం'. ఈ చిత్రాన్ని తెలుగులో 'మకుటం' పేరుతో విడుదల చేయనున్నారు. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'U/A' సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి. ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్, యోగి బాబు, జాన్ విజయ్, అజయ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాతో విశాల్ దర్శకుడిగా కూడా పరిచయం అవుతున్నారు. సూపర్‌గుడ్ ఫిలింస్ బ్యానర్‌పై ఆర్.బి. చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఆ సంస్థ నుంచి వస్తున్న 99వ చిత్రంగా నిలిచింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందించారు.

## రంగంలోకి దిగిన నాగార్జున




సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మ, గోమతి రెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పళ్ళ బురుసు'. తెలంగాణ యాస, సంస్కృతిని ప్రతిబింబించేలా దర్శకుడు ఉదయ్ చౌహాన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఎపిక్ స్టూడియోస్‌తో కలిసి నాగార్జున ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి స్పందనను అందుకున్నాయి. తాజాగా ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా నాగార్జున కూడా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఆయన 'పళ్ళ బురుసు' చిత్ర బృందంతో ఓ ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించినట్లు సమాచారం. ఆ ఇంటర్వ్యూను ఈ రోజు లేదా రేపు విడుదల చేసే అవకాశముందని తెలుస్తోంది. ఇక ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఆరంభం నుంచి చివరి వరకు వినోదాత్మకంగా సాగుతూ, క్లైమాక్స్‌లో మాత్రం భావోద్వేగభరితమైన మలుపు ఉంటుందని సమాచారం. ప్రమోషన్ల కోసం స్వయంగా నాగార్జున రంగంలోకి దిగడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, అంచనాలు పెరిగే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## వారణాసి నుంచి లీకైన సన్నివేశం..




తాజాగా నిన్న కూడా ఓ లీకైన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో మహేష్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న చిన్న సన్నివేశాలు లీక్ కావడం పెద్ద సమస్య కాకపోయినా, భవిష్యత్తులో కీలక సన్నివేశాలు బయటకు వస్తే సినిమాపై ప్రభావం పడే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, నిన్న లీకైన సన్నివేశం అసలు సినిమాకు సంబంధించినది కాదని తెలుస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్న ప్రత్యేక వీడియో కోసం చిత్రీకరించిన సన్నివేశమే అది అని సమాచారం. ఇప్పటివరకు మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా 'వారణాసి' నుంచి ఎలాంటి అప్డేట్ ఉంటుందనే విషయంపై అధికారిక ప్రకటన రాలేదు. అయితే లీకైన వీడియో పుట్టినరోజు స్పెషల్‌కు సంబంధించినదేనని ప్రచారం జరుగుతుండటంతో మహేష్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## అల్లు అర్జున్ ఫ్యాన్స్‌కు క్రేజీ న్యూస్!







ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, స్టార్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం AA23. ఈ చిత్రం ప్రకటించిన రోజు నుంచే దీనిపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. అల్లు అర్జున్ -- లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న తొలి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ ఆసక్తి నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో కనిపించే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. కథలో కీలక మలుపు తీసుకొచ్చే పవర్‌ఫుల్ క్యారెక్టర్ కోసం చిత్రబృందం షాహిద్ పేరును పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో షాహిద్ కపూర్ భాగమైతే, నార్త్ మార్కెట్‌లో ఈ సినిమాకు మరింత క్రేజ్ పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన బయటికి రాలేదు. ఇక ఈ సినిమా గురించి మరో ఆసక్తికరమైన ప్రచారం కూడా వినిపిస్తోంది. లోకేష్ కనగరాజ్ తన మార్క్ స్టైల్‌లో పూర్తి స్థాయి యాక్షన్, ఇంటెన్స్ డ్రామాతో ఈ స్టోరీని సిద్ధం చేశారని, ఇందులో హీరోయిన్ పాత్ర ఉండకపోవచ్చని చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు చూడని పవర్‌ఫుల్ అవతార్‌లో చూపించేలా స్క్రిప్ట్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం. షాహిద్ కపూర్ ఎంట్రీతో పాటు ఇతర ప్రచారాల్లో ఎంతవరకు నిజం ఉందో తెలుసుకోవాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.




## ప్రియాంక చోప్రా సరికొత్త చరిత్ర..

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ప్రస్తుతం దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' మూవీతో చాలా ఏళ్ల తర్వాత తెలుగు ఇండస్ట్రీకి రీ ఎంట్రీ ఇవ్వనుండటం విశేషం. ఇందులో సూపర్ స్టార్ మహేష్ బాబుకు జోడీగా కనిపించబోతున్నారు. భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంగా రాబోతుండగా.. ఇందులో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్‌లో బిజీగా ఉన్న ప్రియాంక చోప్రా.. హాలీవుడ్‌లో సరికొత్త సంచలనం సృష్టిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో వరుసగా భారీ అవకాశాలు దక్కించుకుంటున్న ఆమె, ఇప్పుడు మరొక క్రేజీ హాలీవుడ్ చిత్రంలో నటించేందుకు సిద్ధమయ్యారు. ఆస్కార్ అవార్డు పొందిన దిగ్గజ నటుడు రస్సెల్ క్రోతో కలిసి 'బ్లూప్టై' అనే భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ సినిమాలో ప్రియాంక కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం.ప్రెడేటర్స్' సినిమా, అలాగే ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'స్ట్రేంజర్ థింగ్స్' వెబ్ సిరీస్‌ను తెరకెక్కించిన దర్శకుడు నిమ్రోడ్ అంతాల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ కెనడా టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో అధికారికంగా ప్రదర్శించనున్నారట. అంతేకాకుండా, ఈ ఏడాది చివర్లో ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్ సముద్ర తీర ప్రాంతంలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని టాక్. ఈ సినిమా కథ కాంగో దేశంలోని ప్రమాదకరమైన ప్రదేశంలో సాగుతుందని తెలుస్తోంది. అక్కడ ఎవరికీ తెలియని ఒక విచిత్రమైన విమానాన్ని కనుగొనడానికి వెళ్లే రహస్య మిషన్ చుట్టూ కథ నడుస్తుందట. ఈ ప్రయాణంలో ఎదురయ్యే ఊహించని ప్రమాదాలు, ఉత్కంఠభరిత ఘట్టాలలో ప్రియాంక చోప్రా పాత్ర ఎంతో కీలకంగా ఉండబోతోందని టాక్. సైన్స్ ఫిక్షన్ కథ అయినప్పటికీ, ఇందులో ప్రియాంక నటన ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుందని చిత్ర నిర్మాతలు చెబుతున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.




## నాని 'ది ప్యారడైజ్' టీజర్ రివ్యూ..

న్యాచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'ది ప్యారడైజ్'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. టీజర్‌లో నాని పూర్తిగా కొత్త, రా అండ్ వైలెంట్ అవతార్‌లో కనిపించారు. పవర్‌ఫుల్ విజువల్స్, భారీ యాక్షన్ ఎలిమెంట్స్, ఇంటెన్స్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. నాని పాత్రలోని మాస్ యాంగిల్‌ను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రత్యేకంగా చూపించారు. ఇక నుంచి ఈ జాగ మనదే.. ఈ దేశమే మనదే.. సర్కార్ ఉన్నది మీ దొరల కోసమా.. మా జనం కోసమా, అణచపడ్డ మన జాతి మరలబడాలే, ఛీ అని చీధరించుకున్న నలుపు రంగే మన జెండా వంటి పవర్ ఫుల్ డైలాగ్స్‌తో ఈ టీజర్ హోరెత్తించింది. ప్రతీ ఫ్రేమ్ కొత్తగా ఉంది. నానీ ఈ చిత్రంలో శ్రీకాంత్ ఓదెల ఊర మాస్ యాంగిల్‌లో చూపించినట్లు అర్థం అవుతుంది. మొత్తంగా చూస్తే ఈ టీజర్‌లో నానితో శ్రీకాంత్ ఓదెల బ్లడ్ బ్లాత్ చేయించారు. 'దసరా' తర్వాత నాని--శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాలో కయాదు లోహర్, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీతో పాటు పలు భాషల్లో 2026 సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**